# సుస్వరాల పాలగుమ్మి



## జన్మదిన అభినందన సంచిక

# Suswarala Palagummi

*(A commemorative Volume)*



*Publication :*

NADAVINODINI
Regd. No. 2486/89

*Published in :*
**1999, June**

*Printed at :*
**GETSET Graphics,**
**Hyderabad.**

*Copies available :*
**NADAVINODINI**
1-2-288/14,
Domalguda,
Hyderabad.
Ph: 7633329, 7663870



Rehearsals with Orchersta - Singer: P.B.Srinivas, Saraswathi, Sankar, N.D.S.Srinivasan, Anthony Mathews, Domingo, Shaik Hussain.



RAMAPPA, MUSICAL PLAY IN 1958
Sampath, Purushotham, Pothukuchi Sambasiva Rao, Dasarathi, Hasan Mohd., A.V.Savitri, Kamala Chandra Babu, Sthanam Narasimha Rao, Mangalampalli Balamurali Krishna, M.Chittaranjan, Palagummi Viswanadham, S.S.Raju, C.Narayana Reddy, Ananda Mohan, Nanduri Murali Krishna.

# నమస్సుమాంజలి

లలితసంగీత అభిమానులందరినీ ఒక వేదికమీదకు తీసుకురావాలనే శ్రీ యం.ఎస్. శరత్‌చంద్రకుమార్ గారి సంకల్పం 1988లో 'నాదవినోదిని' గా ఆవిర్భవించింది. సంగీత సాహిత్యపు విలువలుగల పాటలను పొందుపరచి భద్రపరచటం ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. దానికి సారథ్యం వహించమని శ్రీ శరత్‌చంద్రకుమార్‌గారు పాలగుమ్మి విశ్వనాథంగారిని ఆహ్వానించారు. వారిని దూరాన్నించి చూడటమే తప్ప దగ్గరికి వెళ్ళి మాట్లాడే సాహసం చేయలేని మాకు వారి శిష్యులమని చెప్పుకొని పొంగిపోయే అదృష్టాన్ని కలుగజేసారు. అందుకు శ్రీ శరత్‌చంద్రకుమార్‌గారికి మేము సర్వదా కృతజ్ఞులము.

ఆంధ్ర దేశంలో శ్రీ పాలగుమ్మి విశ్వనాథంగారి పాటలను ఎప్పుడో ఒకప్పుడు విని ఆనందించని తెలుగువారు ఉండరనడం అతిశయోక్తి కాదు. ఎన్నో సంవత్సరాల వారి సంగీత యాత్రలో ఆకాశవాణి మాధ్యమంగా భక్తిరంజని, బాలానందం, ఈ మాసపు పాట, స్త్రీల కార్యక్రమం, కార్మికుల కార్యక్రమం వంటి వాటికి సుమారు పదివేల పాటలకు బాణీలు సమకూర్చటమే కాకుండా అయిదు వందలకు మించి సంగీత రూపకాలకు ప్రాణం పోశారు. కర్ణాటక సంగీతమే కాక ఇతర సంగీతాల స్వరూప స్వభావాలను విశదీకరించగలిగిన శ్రీ పాలగుమ్మివారు ఒక 'ఎన్‌సైక్లోపీడియా'.

అటువంటి సంగీత తపస్వీ ఆధ్వర్యంలో మా నాదవినోదిని సంస్థ ఇంతవరకు ఆరు ఆడియో క్యాసెట్లు విడుదల చేసింది. 'అమ్మ దొంగ' అనే పేరుతో వారు వ్రాసిన కవితలను పుస్తక రూపకంగా ముద్రించింది. ముందు తరాలకోసం ఇలాంటి కార్యక్రమాలెన్నో చేపట్టాలన్నదే మా ప్రయత్నం.

1989 సంవత్సరం నుండి నాదవినోదిని సంస్థకు అండదండలుగా వుండి ఎన్నెన్నో పాటలు మాకు నేర్పి మాచేత పాడించడమే కాకుండా, ఈనాటికి చిన్నపిల్లలకు కూడా నేర్పుతున్నారంటే వారికి సంగీతమంటే ఎంత ప్రాణమో తెలుస్తుంది. ఆయన శిష్యులమని చెప్పుకొనే అర్హత సంగీత పరంగా మాకు వుందో లేదోగాని ఆయన మీద మాకుగల ప్రేమ, శ్రద్ధ, భక్తి భావాలు వెల్లడించుకోవాలనే ఉద్దేశ్యంతో 81వ జన్మదినాన వారిని సన్మానించాలనే ఆశతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టాము. వారిని సన్మానించటమంటే ఆ తరపు సంగీత మూర్తులందరినీ సన్మానించినట్లుగా భావిస్తున్నాం.

మేము అడుగగానే వారి అభిప్రాయాలను వ్రాసి పంపిన నిష్ణాతులైన పెద్దలందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ అభినందన సంచిక ప్రచురించాలనే ఉద్దేశం వుందని చెప్పగానే - నాకు పాలగుమ్మి విశ్వనాథం గారంటే చాలా గౌరవం. మనం తప్పకుండా వేద్దామండీ.... అంటూ పుస్తకం అచ్చువేసే బాధ్యత తనదిగా వహించుకున్న శ్రీ డి.టి. నందకుమార్ గారు, వారి బృందం శ్రీమతి పి. నాగరాజ కుమారి, శ్రీ పాలకుర్తి శ్రీనివాసరావు గారు, తదితరులకు మా ధన్యవాదాలు. ఇలా ప్రత్యక్షంగా-పరోక్షంగా కృషి చేసిన అందరికీ మా హృదయపూర్వక నమస్సుమాంజలులు.

నాదవినోదిని




1st Sangeetha Sammelan of Lalitha Sangeetham at Fikki Hall, Delhi. - 1997.
Vedavathi, K.B.K. Mohan Raju, Kotilingam, Sridhar. Anilkumar, Palagummi



## జ్ఞాపకాల ఆల్బం

పాలగుమ్మివారి పుట్టినరోజున వెలిగే ఈ భావసంగీతాజ్యోతికి కొవ్వొత్తి పుచ్చుకుని పక్కనుందామనుకోవడం నిజంగా సాహసమే. సంగీత సాహిత్యాలు నాకు దూరపు బంధువులు. అయితే దాయాదులు కారు. పైగా అమ్మవైపు చుట్టాలు. అందుకేనేమో ఆరెంటినీ కలబోసుకుని హాయిగా రాగాలు తీస్తుండే సుస్వరాల పాలగుమ్మి వారంటే నాకు వల్లమాలిన అభిమానం, ఆపేక్ష. రామప్ప సంగీతరూపకం ప్రసారం అవుతుంటే మా అక్కచెల్లెళ్లందరం రేడియో చుట్టూ చేరి కళ్ళు మూసుకుని వింటూ ఒక్కపాటకైనా వరస పట్టుకోవాలని కిందామీదవడం నా చిన్నప్పటి నుంచి మరచిపోలేని జ్ఞాపకాలలో ఒకటి. మాకు సంగీతం నేర్పేందుకు వేరే గురువులు లేరు కాబట్టి రేడియోనే గురువుగా భావించి పాటలెన్నో నేర్చుకుని మాకు వచ్చినట్లుగా పాడుకుని మురిసిపోయేవాళ్ళం. ఆరోజుల్లో సంగీతంలో అతిరథమహారథులయిన మంగళంపల్లి బాలమురళీగారు, శ్రీ రంగం గోపాలరత్నంగారు, వింజమూరి లక్ష్మిగారు, ఎం.చిత్తరంజన్‌గారు వారందరు రేడియో ద్వారా అందించిన తీయని పాటలని కూనిరాగాలు తీయని ఆడపిల్లలుండేవారుకారు.

విశ్వనాథంగారు మాట్లాడుతుంటే తెలుగింత చక్కగా మాట్లాడవచ్చుకదా మరి మనం ఎందుకు ప్రయత్నించం? అని అనుకుంటూ వుంటాను. మన పెద్దలందరు ఎంతో శ్రద్ధాభక్తులతో పెంచి దాచిఇచ్చిన తేనె లొలికే తేటతెలుగు ఆస్తిని మన పిల్లలకి మిగల్చని మనం ఎంత ఖర్చు మనుషులమో కదా! రేపు రాబోయే తరాల వారికి మారోజుల్లో ఇలా హాయిగా నవ్వుకునేవారు, పలకరించుకునే వారు, లలితంగా సున్నితంగా పాడుకునేవారు సుమా అని తెలియచెప్పాలనే నాదవినోదిని ప్రయత్నానికి పువ్వులందించిన సరస్వతీదేవిగారాల బిడ్డలందరికీ మా అభివందనాలు. ఏకార్యమయినా దివ్యమవాలంటే పండిత పామరులందరూ పాలుపంచుకోవాలి. అందుకే మరి అక్కడా అక్కడా ఇంకా మతాబాల వెలుతురు విరజిమ్మే పెద్దల్ని గౌరవించుకునే ఈజ్ఞాపకాల ఆల్బంలో నాక్కూడా చోటు దొరికినందుకు నన్ను నేను అభినందించుకుంటున్నాను.

సోమరాజు సుశీల



Illustrious Brother of Palagummi - Sri Palagummi Padmaraju (Famous Writer)



Best Friend of Palagummi - Sasanka (Famous poet)



# లలిత సంగీతానికి గౌరవం చేకూర్చిన మా విశ్వనాథం

ఎన్నాళ్ళ క్రిందటి మాటో! నేను కాకినాడలో బి.ఎ. చదువుతున్న రోజులు. అప్పుడు నా దగ్గర వీణ అభ్యసించడానికి వచ్చిన వ్యక్తి, ప్రథమ శిష్యుడూ పాలగుమ్మి విశ్వనాథమే! తర్వాత నేను మద్రాసులో జెమినీ స్టూడియోస్‌లో చేరడం - విశ్వనాథం నాతోటే మద్రాస్ రావడం, కూడానే ఉంటూ ఒకపక్క సంగీత కళాకేంద్రమైన మద్రాసులో పెద్ద పెద్ద విద్వాంసుల శాస్త్రీయ సంగీతం వినడం, మరోపక్క సినీ సంగీత జగత్తులో జరుగుతున్న అనేక ప్రయోగాలు - కొత్త కొత్త సంగీతాలు చెవుల్లో పడడం - జెమినీ స్టూడియోస్‌లో నేను సంగీతం సమకూరుస్తున్న చిత్రాలకు నాతోటే ఉంటూ నాతో కూడా వీణ వాయిస్తూ గడించుకున్న అనుభవం ఇవన్నీ కలిసి విశ్వనాథం ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల కళాకారుడుగా రూపుదిద్దుకొన్నాడు.

సంగీతంలో గురువు చేసేదల్లా అనంతమైన నాద ప్రపంచంలో కొంత సామగ్రి శిష్యుడి చేతుల్లో పెట్టి, కొంత దూరం చేయి పట్టుకొని నడిపించి, అక్కడ వదిలి వెయ్యడమే. తర్వాత తన మార్గం తానే వెతుక్కుని ముందుకు ప్రయాణించే శక్తి శిష్యుడు సంపాదించుకోవాలి. అల్లాంటి శక్తి అక్షరాలా సంపాదించుకున్న కళాకారుడు విశ్వనాథం. అనంతమైన సంగీత ప్రపంచంలో లలిత సంగీతానికి కూడా ఒక గౌరవమైన స్థానం ఉందనీ, శాస్త్రీయ సంగీతంలో సమఉజ్జీగా, ప్రజల ఆదరాభిమానాలను పొందగలిగిన అర్హత లలిత సంగీతానికి ఉందని నిరూపించడానికి, అతడు చేసిన కృషి ప్రశంసనీయమైనది. లలిత సంగీతం అంటే తేలికైన విషయం కాదు. లలిత సంగీత ప్రయోక్తకి సంగీత సాహిత్యాలతో సమానమైన పరిచయం ఉండాలి. సాహిత్యంలోని భావాలకు సంగీత చిత్రాలను గీయగలిగిన సృజనాత్మక శక్తి ఉండాలి. ఇవన్నీ విశ్వనాథానికి దండిగా ఉన్నాయి. అందుకే విశ్వనాథానికి సన్మానం చేస్తున్నారంటే నాకు ఆశ్చర్యం అనిపించలేదు. ఒక కళాకారుణ్ణి గుర్తించి గౌరవించవలసిన బాధ్యత ప్రజలమీదే ఉంది.

(1979 సం.లో జరిగిన విశ్వనాథంగారి సన్మాన కార్యక్రమం సందర్భంగా
- ఆయన గురువుగారైన శ్రీ ఈమని శంకరశాస్త్రిగారి పలుకులు)

## సంగీత, సాహిత్య జ్ఞానం అపారం

శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారితో నా చిరకాల మైత్రి నిత్యమైన మధురానుభూతి. వారి సంగీత సాహిత్య జ్ఞానం అపారం. భావగీతాలకు సమకూర్చిన వారి సంగీతం ఒక క్రొత్త స్వరూపాన్ని సంతరించుకుంది. వారు ఆకాశవాణికి చేసిన సేవ వల్ల ఆకాశవాణికి కీర్తి లభించినది. వారి సంగీత సమకూర్పు మనం పాడినప్పుడు ఉత్సాహం, ఉత్తేజం కలుగుతుంది. ఇది నా స్వానుభవం. ఎప్పుడూ నవ్వుతూ అందరికీ ఆహ్లాదాన్ని కలిగించే స్నేహశీలి, ఎవరిలో ఎటువంటి విశేషం వున్నా దానిని గ్రహించి, ఉత్సాహపరచి, ప్రోత్సహించే సుగుణవంతుడు. వారి సంగీత గేయాలను పాడే సదవకాశము నాకు లభించినందుకు గర్వపడుతూ వుంటాను. ఎంతోమంది, ఎన్నో సందర్భాలలో కూర్చిన ఎన్నో పాటలు నేను పాడినప్పటికీ విశ్వనాథుని సంగీతంలో పాడినవి ఎప్పుడూ జ్ఞాపకం వుంటాయి. సాహిత్యంలో ఒక విశ్వనాథుడూ సంగీతంలో ఒక విశ్వనాథుడూ ప్రభవించడం ఆంధ్రదేశానికి అదృష్టం. వారి అనుభవాన్ని నేటి యువకులు గ్రహించవలయును. ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రభుత్వము వీరిని ఇతోధికముగా గుర్తించి గౌరవించవలయును.

శ్రీ పాలగుమ్మి విశ్వనాథంగారు దీర్ఘాయుష్మంతులై, ఆరోగ్యవంతులై ఐశ్వర్యంతో కలకాలం సుఖంగా జీవితాన్ని గడపవలెనని ఆశిస్తూ, యీ శుభసమయంలో వారికి మనసా శిరసా నమస్కరిస్తూ నాకు వారి యందుగల ప్రేమనూ, గౌరవాన్నీ తెలియచేస్తున్నాను.

మంగళంపల్లి బాలమురళీకృష్ణ
చెన్నై



## అమృతోపమానమైన సంగీత సేవ

సంగీత సాహిత్యాలు సంపూర్ణంగా సమాన స్థాయిలో వున్న మహా విద్యలు. కళలు చతుష్షష్టి కళలు అంటారు. వీటన్నిటిలో శిఖర స్థానంలో వున్నవి సంగీత సాహిత్యాలు. అయితే ముఖ్యమైన విషయం సంగీతసాహిత్యాలు అన్ని విధాలా సమాన స్థాయిలో వున్నాయి అన్న సత్యం గ్రహించడం అవసరం. ''సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం'' ఇక్కడ ఉపమానం సంగీత సాహిత్యాల సమానతలో వున్న సమగ్రత్వాన్ని వ్యక్తం చేస్తుంది. బహుశా ఇంతకంటె గొప్ప ఉపమానం సృష్టియంతా వెతికినా లభించదు. మనము జగన్మాత అయిన సరస్వతి యొక్క స్తన్యము గ్రోలి పెరిగి పెద్దవారమై ప్రజ్ఞావంతులమవుతున్నాము కనుక ఆ మాతృస్తనములు మనకు పూజ్యములు. కనుక ఈ ఉపమానం కూడా పూజ్యమైన ఉపమానం.

సాహిత్యం, సంగీతం లేక జీవించలేదు. సంగీతం మిళితమైనప్పుడే సాహిత్యం దీర్ఘాయుష్మమవుతుంది. అతి ప్రాచీనములైన ఋగ్వేదాదులు ఈ నాటికీ సజీవములై మనకు దారి చూపిస్తున్నాయంటే ఆ వేదచ్ఛందస్సు ఛందోబద్ధమగుట చేతనే. తర్వాత వచ్చిన రామాయణాది ఇతిహాస పురాణ కావ్యాదులన్నీ ఛందోబద్ధములే. రామాయణంలో వాల్మీకి అంటాడు ''పాదబద్ధోక్షర సమం తంత్రీలయ సమన్వితం'' అంటే ఆయన వ్రాసిన రామాయణం తంత్రీలయ సమన్వితం. తంత్రీవాద్య సంగతితో లయ ప్రధానముగా చేయబడిన రచన కనుక రామాయణం పాడబడే రచన. అందుచేతనే ఆయనతోపాటు కావ్యాలు వ్రాసిన ఎందరో కవులవి పోగా పాడుటకు యోగ్యమైన ఈ కావ్యం మాత్రమే నిలిచింది. భావానికి రాగ తాళాలు అనివార్యం. రాగ తాళాలను విడిచి వ్రాసిన వచన రచనలు కావ్య కృతులైనప్పటికీ ఎన్నో నశించాయి. కొన్ని శిథిలావస్థలో వున్నాయి. లయాన్విత రచనలు చిరకాలం జ్ఞాపకం వుంటాయి. లయరహిత రచనలు కవిత్వం చేత ఎంత ఆకర్షణీయములైనప్పటికీ వాటిని లయాన్విత రచనవలె శ్రోతలు లేక పఠితలు సాధారణ జీవనంలో ఉల్లేఖింపక పోవడం చేత అవి మరుగున పడిపోతాయి. బాణుడు రాసిన కాదంబరిలో కాళిదాసాదుల కావ్యాల్లో కంటే కవిత్వపు పాలు హెచ్చుగా వున్నట్లు మనకు అనిపిస్తుంది. అంత ఆకర్షణీయమైన కావ్యం. కానీ అది వచనంలో వ్రాయబడటం చేత రఘువంశ, మేఘసందేశ, శిశుపాలవధాది కావ్యాల నుంచి మనం రమణీయ శ్లోకాలను ఉల్లేఖించినట్లు కాదంబరి నుంచి ఉల్లేఖించము. తాత్పర్యం, సంగీతం

సాహిత్యానికి దీర్ఘాయుష్షునిస్తుంది. సాహిత్యం చిరంజీవి కావాలంటే సంగీత సమన్వితం కావాలి.

ఈ రెంటిని సరస్వతీ స్తనములు అన్న కవే ''ఏకమాపాతమధురం - అన్య దాలోచనామృతం'' ఒకటి ఆపాతమధురము. మరొకటి ఆలోచన చేసే కొలది అమృతంగా ఉంటుంది. ఇదంతా చెప్పడానికి కారణం నేడు నాగరికత శిథిలమైన ఈ సమాజంలో కవులను గాయకులకంటే గొప్ప వాళ్లుగా భావిస్తున్నారు అది తప్పు అని చెప్పడానికి మాత్రమే. ఒక కవి ఇలా అన్నాడు ''యథానయతి కైలాసం నగం గాన సరస్వతీ - తథానయతి కైలాసం న గంగా న సరస్వతీం''

సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువే ఇలా అన్నాడు.

''నాహం వసామి వైకుంఠే యోగినాం హృదయేనచ
మద్భక్తాః యత్ర గాయంతి తత్ర తిష్ఠామినారద''

సంగీతంలో శిఖర స్థానీయులు నారదాది దేవర్షులు. నారదుడు రాసిన సంగీత శాస్త్ర గ్రంథం పేరు ''నారదీయ శిక్ష''. నారదుడే వ్రాసిన మరొక గ్రంథం ''రాగ నిరూపణం''. ఆయనదే మరొకటి ''సంగీత మకరందం''. అసలు సంగీతం పుట్టిన విధాన్ని వర్ణించిన విధం ఆశ్చర్యావహంగా వుంటుంది. షడ్జం మయూరోవదతి, గావోరంభంతిచర్షభం. పుష్ప సాధారణేకాలే కోకిలో వదతి పంచమం. ఇలా సప్త స్వరాలు ప్రకృతిలోని జీవరాసుల్లోంచి తీసుకోబడ్డాయి. యోగదృష్టివున్న మహర్షుల చేత 'షోపే ' (Chopin) అనే గొప్ప ఫ్రెంచి స్వరకల్పన కోవిదుడు తన స్వరకల్పనల్ని వర్షం కురుస్తున్నప్పుడు రాలే వర్షబిందువుల శబ్దాలనుంచి గ్రహించాడని చెపుతారు. అందుచేత నేను పూర్వం చెప్పినది పుక్కిటి పురాణమను కోవడానికి వీలుకాదు.

ఎంత గొప్పగీతం వ్రాసినప్పటికీ సంగీతం దానికి ప్రాణం పోసే వరకు అదిలేచి నిలిచి బహుభంగిమల్లో విలాస కళలు చూపిస్తూ శ్రోతలను ముగ్ధులను చేయలేదు. ఇది సంగీతము యొక్క అనివార్యతను అందరూ గ్రహించటానికి చెప్పుకున్న మాట. మహాభక్తులైన వాళ్లందరూ మహాకవులే. అయితే మనం గ్రహించవలసింది వాళ్ల రచనలన్నీ వారే స్వరకల్పన చేసి పాడి ఆ గానం చేత తన్మయీ భావం పొంది తరించారు. జయదేవుడు అలాంటి వారిలో వరిష్ఠుడు ఆయన అంటాడు



''యది హరిస్మరణే సరసం మనో
యది విలాస కలాసు కుతూహలం
మధుర కోమల కాంత పదావళీం
శృణు తదా జయదేవ సరస్వతీం''

ఈ సంగీత ప్రధాన కవి భారతీయ సాహిత్యంలో మహామహులైన లాక్షణికుల చేత తమ గ్రంథాల్లో ఉదహరింప బడ్డాయి. ఆయనే మరుజన్మలో లీలాశుకుడై జన్మించి అతి మధురమైన కృష్ణకర్ణామృతమును వ్రాశాడంటారు. ఆయనే తన తృతీయజన్మలో నారాయణ తీర్థులై జన్మించి కృష్ణలీలా తరంగిణి వ్రాసి ఆంధ్రదేశాన్ని పునీతం చేశాడట. భక్తులందరూ సాధారణ సంప్రదాయ కవి పరంపర కంటే గొప్ప కవులు కబీరు, మీరా, సూర్, తులసీదాస్ అలాగే అన్నమయ్య, రామదాసు, పురందరదాసు, త్యాగరాజు ఇత్యాదులు నిష్కర్షగా మహా కవులని చెప్పాలి. వారు సామాన్య ప్రజానీకం లోకి చొచ్చుకొని పోయి వారిలో జీవనపు విలువలను అంకురారోపణ చేసినట్లు అన్య కవులెవ్వరూ చెయ్యలేదు. దీనికంతటికీ తాత్పర్యం ''సంగీతమే సర్వోపరి కళ'' అని చెప్పడమే. ఒకడు వ్రాసిన పాట పాడబడే వరకు మృత శరీరంలా పడి వుంటుంది. గాయకుడి స్వర విలాసం దానిలోకి ప్రవేశించగానే అది షోడశ కళా ప్రపూర్ణమై పూర్ణిమా చంద్రమండలంగా మారి మనల్ని ఆహ్లాదంలో ముంచుతుంది. సంగీతంలో స్వరకల్పనకు గొప్ప ప్రతిభ కావాలి. కారణం అది సృజనాత్మక కళ. కవిత్వం కూడా సాధారణ భాషలోకి తన ఆత్మను ఊది ప్రాణం పోసి కవి ఆ భాషకు అయస్కాంతశక్తి ప్రదానం చేస్తాడు. కనుక సంగీతంలో స్వరకల్పన చేసేవాడు సాహిత్యంలో కవిత్వం లాంటి సృజనాత్మక రచన చేసేవాడూ ఇద్దరూ సమాన స్కంధులై వుంటారు. వాస్తవంగా కవిత్వం కంటే గానానికి శ్రోతల సంఖ్య అసంఖ్యాకం. కారణం ''శిశుర్వేత్తి, పశుర్వేత్తి వేత్తిగానరసం ఫణీ'', అంటే సంగీతానికి శ్రోతలు, శిశువులు, పశువులు, పాములు అని. ఇక ఈ శ్రోతల సంఖ్యను ఎలా మనం లెక్క పెట్టగలం? కవికి ఇలాంటి శ్రోతలెవ్వరూ లేరు. ఇంత వరకు చెప్పిన ఈ మాటల ప్రకాశ మండలంలో మన సమకాలికుడని మనం గర్వించగదిన పాలగుమ్మి విశ్వనాథం గారిని పెట్టి మనం దర్శించాలి. ఆయన గాయకుడే కాదు స్వరకల్పన కళాకోవిదుడు. గాయకుడు గొప్పవాడే. మనచేత గానకళా మాధుర్య రసాన్ని ఆస్వాదింప చేస్తాడు కనుక. కానీ ఆ గాయకుడు ఒకపాటను అలా గానం చేయడానికి కారకుడు మరొకడున్నాడని చాలామందికి తెలీదు. అతడే స్వరకల్పన కర్త. ఒక పాటను ఈ విధంగా పాడాలి అని ఆరోహణావరోహణలు ఇత్యాది అనిర్వచనీయ కేవల ప్రతిభాధీనమైన స్వరలీలా

విలాసాలను సృష్టించి ఆ పాటను స్వరబద్ధం చేస్తాడు. ఆ స్వర రచనను అనుసరించి గానయోగ్య కంఠమున్న ఎవడైనా పాడి ఆ పాట చేత శ్రోతలను రంజింప జేయగలుగుతాడు. మనకు పూర్వం ఓలేటి వెంకటేశ్వర్లు గారుండేవారు. తర్వాత ప్రసిద్ధులు రజనీకాంతరావు, బాలమురళీగార్లున్నారు. ఇలాంటి గొప్ప స్వరకల్పనా చాతురీధురీణుల పరంపర మన ఆంధ్రదేశంలో వుండటం మన పుణ్యవిశేషం అనుకోవాలి. గంగా ప్రవాహం లాంటి ఆపరంపరలోని మహనీయుడు విశ్వనాథం గారు. వారు మనకు తమ ప్రతిభ ద్వారా చేసిన అమృతోపమానమైన సంగీతసేవచేత తెలుగుజాతి ఆయనకు ఋణగ్రస్తమైంది. ఆ ఋణం తీర్చుకోగలిగిన ఋణం కాదు. కానీ యధాశక్తి మనం ఆయనను సభాముఖంగా సన్మానించి ఆనందం పొందడం మన నైతిక కర్తవ్యం. విశ్వనాథం గారికి నా వినమ్ర ప్రణామాలు.

గుంటూరు శేషేంద్రశర్మ



Mohd. Baig (Dholak); Quyam Hussain (Sarangi); Anthony Mathews (Violin);
Hasan Mohd. (Kasht tharang); Sankar (Sitar); Parthasarathy (Flute); Palagummi (Veena);
Ambadas Apte (Tambura); Sankar (Flute); J.M. Domingo (Top Violin);
L Rayanna (Clarinet); Chotekhan (Tabla)
Orchestra conducted by Palagummi at old Khairatabad Studio's All India Radio in the year 1955



# ప్రతిపాటా ప్రశాంత ఝరి

పాలగుమ్మి విశ్వనాథం గారు అనగానే నా జ్ఞాపకాలు దాదాపు నాలుగు దశాబ్దాలు వెనక్కి వెళ్ళిపోతాయి. నా చిన్నప్పుడు అంటే ఇంకా 2,3 క్లాసులు చదువుకుంటున్న రోజుల్లో - పున్నమ్మ తోటలోనే దాదాపు రేడియో వారంతా ఉండేవారు. అందుకని పొద్దున్నే లేచి పళ్ళు తోముకొని దాదాపు ప్రతి గడపా ఎక్కి అందరినీ పలకరించి, వారి ఆప్యాయతకు అనురాగానికీ పులకరించి మళ్ళీ నా ఆటపాటలలోకి తుర్రుమంటుండే రోజులు.

అప్పటి నుంచే పాలగుమ్మి విశ్వనాథంగారిని మామయ్య గారంటూ పలకరిస్తూ - ఉండేవాళ్ళం. అదే అనురాగ పూరితమైన పలకరింపు. అదే విగ్రహం. అదే ఉత్సాహం. కాస్త మహా జుట్టు తెల్లబడిందేమో! అంతే అప్పుడే ఆయనకి 81 ఏళ్ళ పుట్టినరోజు జరుగుతోందంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఆ జీవన గమనంలో గడిచిన అన్ని వసంతాలూ లలిత సంగీత ప్రపంచానికి మైలురాళ్ళు. విజయవాడ కేంద్రంలో లలితసంగీత ప్రయోక్తగా శ్రీపాలగుమ్మి విశ్వనాథంగారు ఆ రోజుల్లో ఎన్నెన్నో చిరస్మరణీయమైన పాటలకు బాణీలు కూర్చారు.

ఫలానావారి సంగీతం అని తెలియని మా చిన్న తనంలోనే ఆయన పాటలు మా అందరి నోళ్ళల్లో - అంటే కాస్త పాటపాడే ఆసక్తి ఉన్న విద్యార్థులం స్కూళ్ళలో functionకీ వాటికీ ముందుగా పాడుతుండే పాట 'భూధరమో సాగరమో' --

అలాగే ''కమ్మగా బ్రతికితే గాంధీయుగం'', ''నారాయణ నారాయణ అల్లా అల్లా'' ..., ''తరలి రారమ్మా'' వంటి పాటలు రాని బడిపిల్లలు అరుదే. బాలానందంలో కూడా చిన్నపిల్లలు కాస్త శృతి లయ ఉన్నవాళ్ళు ఎక్కువగా ఈ పాటలే పాడుతుండేవారు.

అలాగే మల్లాది శివరాంగారి గేయం పాలగుమ్మి గారి స్వరరచనలో ''పొరపాటునా మోక్షం వస్తే పుట్టుక లేకుండా పోతే - ఇలా తలానికి దూరంగా ఎలాగన్నదే నాకు భయం - ఈలోకంలో ఈనా దేశంలో - ఈనా ఇప్పటి దేహంలో ఎన్నాళ్ళైనా బ్రతకడమిష్టం'' అంటూ తరచు మనస్సులో మెదులు తుండేది.

పాలగుమ్మి వారి బాణీలకి, ఒక ప్రత్యేకత ఉంది. సహజంగా వారు మంచి వైణికులు కావడంతో పాటల్లో చక్కటి లాలిత్యం నిజంగా లలిత

సంగీతానికే పెట్టని ఆభరణం. ఆయన బాణీలన్నీ కూడా వీణ పలికినట్లు అతి సున్నితంగా మనస్సును అలరిస్తాయి. ''రాలలోపల పూలు పూసిన" అన్న పాట - డాక్టర్ సి.నారాయణరెడ్డిగారి ''రామప్ప" నాటకం లోనిది. చిత్తరంజన్ గారి గొంతులో చిరజీవిత్వం పొందింది. ''తరాల క్రిందటి పురాణ కథలూ, శాస్త్రం మతమూ సమస్త కళలూ తన ఎదలోనే దాచుకొన్నది - కనులున్న వారినే చూడమన్నది" - అన్నట్లు ''ఈ నల్లని రాలలో ఏ కన్నులు దాగెనో" - అన్నట్లూ లలిత గేయాలను అమృత కలశాల వంటి రాగాలతో ముంచి రస హృదయులకు అందించిన తెలుగు లలిత గీత రసనాధుడు శ్రీ పాలగుమ్మి విశ్వనాథం.

అక్షరాకృతిలో ఉన్న గీతానికి రూపునిచ్చి, స్వరరూపమిచ్చి - స్వస్వరూపంతో శాశ్వతత్వాన్నిచ్చేది సంగీతకారుడు. అంటే ఆ గేయానికి ఆ బాణీ కాక వేరే ఇంకే బాణీ పొరపాటున చెవిన పడినా మనసు బాధ పడుతుంది. అలా లలిత సంగీతంలో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి ఎన్నెన్నో పాటలు ఈయన స్వరాకృతిలో ఒదిగి కాల ప్రవాహంలో తలలెత్తుకు ఠీవిగా నిలబడ్డాయి. కాలానికి, లలిత గీతానికి శాశ్వతత్వాన్నిచ్చిన ఆ పాటలు దేవులపల్లి వారి ''శివ శివ శివ యనరాదా" ......, ''నీయడుగులే కాక నిరుపేద బ్రతుకునకు ఏయేడుగడకలదురా," ''పదములె చాలు రామా - నీ పద ధూళులె పదివేలు" ఇంకా కాస్త జానపద బాణీలో ''ఆకాశం వంగింది ఆ కడలి పొంగింది - హైలెస్సా ఓలెస్సా" మొదలైనవి.

ఆయనతో పరిచయం ఉన్న ప్రతివారికీ ఆయన నడకలో చిన్న ఊపు తమాషాగా ఉంటుంది. అలాగే ఆయన ప్రతిపాట చక్కని ఊపుతో ప్రశాంత ఝరిలా సాగుతుంది.

మీగడ తఱకల్లాటి మధురగేయాలను తెలుగువారి కందించిన పాలగుమ్మి గారి 80 వసంతాలు తెలుగుపాటకు నిత్య వసంతాలు.

వేదవతి

స్టేషన్ డైరక్టర్, ఆకాశవాణి

విజయవాడ



# పాలగుమ్మి విశ్వనాథా

ఆ॥ నీవుగొన్న ఘనత నీవెఱుంగవు గాన
కళ ముఖాన సకల కళలగన్న
నీకు దెల్పుచుంటి నేను నీగరిమంబు
వినుము ''పాలగుమ్మి విశ్వనాథ"

శ్రీ వాణీవర దివ్యమాణిక్య వీణానాద
నిరంతరోపాసనా లాలస మానసానందధనా !
క్షీరాబ్ధిసిత తరంగోత్తుంగ భావాంతరంగ సంజనిత
బహువిధ వర్ణ రాగతాళ సంయుత సంగీత కళా
సుమధుర స్వర పీయూషవర్షాఘనా !!
ఘనసాధనాబల సాధితానేక మహోజ్జ్వల
విమల శోభావిభవా భాభాసమానాస
మానసాధనా సంపాదిత దిశావ్యాప్త
కీర్తి చంద్రికా కళంక ధావళ్యబహుళ్య
భవ్యసారళ్య సంభరిత వినయగుణాది
వినుత సుగుణ గణ సమాసాదిత విశిష్ట
జీవన వివిధ విజయ పరంపరామోఘ
విద్యాదత్త ప్రతిహత ప్రతిభా సంభూత
చిత్ర విచిత్ర సంభవమయ రస సంపూర్ణాతుల
వివేక వర్ధన విలాసగాథా !
వినిర్జిత క్రోధా !
నిజరసికావతంస ప్రశంసాఖిల విశ్వనాథా !
నీకు సాటి నీవేగద ''పాలగుమ్మి విశ్వనాథా!"
నిష్ఠతో నిరతకళాసేవ నెఱపుతున్న
నీధన్యజీవనానికి మాజోహారులు !
నిన్ను సదాయెంచి, అభినందించి, అభినందిస్తూ
వుంటారు నీ వీణబాణీని అవగాహన చేసుకొని,
ఆనందించగలిగిన రసాభిజ్ఞతా నందనవన
విహారులు !
స్వరవాణీ శ్రీ వరపుత్రులైన మహా

మహోపాధ్యాయ పద్మశ్రీ ఈమని
శంకరశాస్త్రి నీ గురువులు !
వారివద్ద అభ్యసించిన వినూతన
ప్రయోగ ప్రక్రియలందు నిపుణుడవైన
నీవు ద్వాదశ సుస్వర సులక్షణ సురచనా
వృత్తి యందు లక్ష్యసిద్ధికొఱకై
కనుగొన్నావెన్నెన్నో క్రొంగొత్త తెరువులు !
కథక చక్రవర్తి సోదరుడవైన నీ స్వరకల్పనా
శక్తి సీమారహితం
వ్యథని మఱిపించే నీ కమనీయ సంగీత స్వర్ణ
రచనా ప్రజ్ఞాసువర్ణపుష్పం, సౌహార్దమార్దవ సంపన్న
సాహిత్యలాలిత్య సౌందర్య మాధుర్య వైవిధ్య సౌగంధ్య సహితం !
ఎనలేని వ్యక్తిత్వం గలది నీ నిరుపమ వీణావాణి !
ఎన్నెన్నో అపూర్వావకాశాలు నీకు ప్రసాదించింది,
ప్రసాదిస్తూనే వుంటుంది అనంతమైన ఆకాశవాణి (A.I.R.)
అహరహం మనోహరంగా వినిపిస్తూనే వుంటుంది
నీభావాధిక్యమయ హృదయస్వర గానం !
అద్భుతమైనదీ, అగాధమైనదీని -
నీ సప్తస్వర కళాజ్ఞానం !
సంగీత సోమయాజీ నీకు సర్వేశ్వరుడు
సమస్త సన్మంగళాలనీ చేకూర్చుగాత !
సాహిత్య జ్ఞానఖనీ ! నీ ఇతోధిక కళా
సేవనుకంటూ, నీవర్ధిష్ణుయశోగానాన్ని
వింటూ సదాగర్విస్తూవుండాలి,
కళలకాణాచి యనదగిన మన
భారతమాత !!!

పి.బి. శ్రీనివాస్



# అభినందన మందారాలు

ఎనభైయేళ్ల పరిణతిలో తొణికిసలాడే యువచైతన్యం, పండబారిన శిరస్సు, సన్నని కాయవాటు శరీరం, తెల్లటి దుస్తులు, గమకాల నొక్కులొలికే గాత్రం, వీణమీటుకి స్వరాల దాటుకి ఉద్యుక్తమయ్యే వ్రేళ్ల కదలికలు, వైదుష్యం వెరసి పాలగుమ్మి విశ్వనాథంగారు. మంచి తనానికి స్నేహానికి మారు పేరైన మాన్య మిత్రులు శ్రీ పాలగుమ్మి విశ్వనాథంగారి ఎనభై ఒకటవ జన్మదిన సందర్భాన ఈ అభినందన కుసుమాల నర్పిస్తున్నాను. డెబ్భైయేళ్లకు పైగానే ఆ ప్రతిభామూర్తి ఆంధ్రావని కందిస్తున్న కళాసేవనర్చించి ప్రేమాంజలి ఘటిస్తున్నాను.

''తనువే వొళవు తలయే దండెకాయ
ఘనమైన వూర్పులు రెండు కట్టిన తాళ్లు
మనసే నీ బద్దితాడు మరి గుణాలే జీవాళి
మొనసే పుట్టగే మూలమైన కరడి'' అంటూ వెనుక అన్నమాచార్యులవారు జీవుని స్వామివారి చేతిలోని తంబురా దండెగా భావించి పాడుకొన్నారు. ఆ భావనకు యథార్థ రూపకల్పనంగా భాసిస్తుంది పాలగుమ్మి విశ్వనాథంగారి ఆకృతి. ఆయన ఒక నడయాడే కచ్ఛపి. మాధుర్యాన్ని పంచిపెట్టే మహతి.

విశ్వనాథంగారిని అలవాటు చొప్పున ''వాగ్గేయకారు''లంటే చాలదనిపిస్తుంది. ఉభయకారులైన బయకారులు సాధారణంగా తాము వ్రాసి, పాడి, లోకాన్ని రంజింపజేస్తారు. వీరు ఆ పనీ బహుళంగానే సాగించారు. అంతేకాదు అంతకు మించి, తాము గేయాంశ నందిస్తూ దానికి తగ్గట్టు మహా కవుల చేతనూ పలికింపజేశారు, పరుల వాక్కల్పనలకు మనోహరంగా తమ గేయాంశను జోడించి ఆనందింపజేశారు. మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి చాలా చాలా మంచి పాటలు కొన్నింటిని సంపూర్ణావిష్కృతికి వీరే కారకులూ ప్రేరకులూ అనడం అతిశయోక్తి కాదన్న సంగతి వారికి సన్నిహితంగా ఎరిగినవారికందరికీ తెలుసు. వీరి వీణానాదానికి స్పందిస్తూ ఆవెంట సాగిన వారి మాటా, వారి మాటకు దీటుగా శ్రుతి కలుపుకొంటూ సాగిన వీరి పాటా పూవూ తావీలా కలిసి రాణించాయి. పారిజాత సురసుమాలుగా పరిమళించి పరవశింపజేశాయి. ఈ విషయంలో వీరు టూ-ఇన్-వన్ కాక త్రీ-ఇన్-వన్ అనుకోవడంలోని ఆంతర్యం అదే.

మంచి పాటలవేట ఆయనగారికొక క్రీడ. ఆ క్రీడలో ఆయన సవ్యసాచి. అలాటి పాటల వేటలో విశ్వనాథంగారు వెచ్చించే కాలాన్ని గమనించే వారు కారు. పెద్ద చిన్న లాటి తారతమ్యాలెంచే వారు కారు. దూరభారాన్ని వ్యయ ప్రయాసల్నీ పరిగణించేవారు కారు. మంచి పాట రాయడమే వారి లక్ష్యం. అలాటి వాగ్గేయ రచనా కేళిలో దేవులపల్లి వారితో కలసి తామెన్ని పొద్దులు ఎలా గడిపేవారో అవి వారే చెప్పగా వినవలసిన మాటలు. నా అనుభవం ఒకటి చెబుతాను - ఆకాశవాణిలో 'ఈ మాసపు పాట' కోసమని ఒకసారి వారు ఫోన్‌చేసి మాయింటికి రావడం నన్ను సంభ్రమాశ్చర్యాలతో ముంచి వేసింది. అప్పుడనుకొన్నాను పాటలు రాసే వారు చాలామందే ఉంటారు గానీ మంచి పాటలు రాయించే వారి లాటి సహృదయులు మాత్రం చాలా అరుదుగా ఉంటారని కాంట్రాక్టు వచ్చింది. వస్తు వరణ భారాన్ని నాకే వదిలేశారు. కళాకృతి రూపుదిద్దుకొనే ఏమాటకైనా పాటకైనా ఆనందంతోపాటు ప్రకరణశుద్ధీ, ప్రయోజన సిద్ధీ ఉండాలన్నది నా అభిమతం. ప్రత్యేకంగా ప్రపంచ దృష్టిని వాతావరణ కాలుష్య నివారణకు సారించాలనుకొంటున్న రోజులవి. కనుక నా దృష్టి చెట్టుమీదికి పోయింది. ''తరువే జీవన దాత్రి ధరిత్రికి - తరువే ప్రాణాధారము జగతికి'' అనే పల్లవి రూపుదిద్దుకొన్నది. మరునాడు విశ్వనాథంగారు ఫోన్ చేస్తే లైను మీదనే పల్లవి వినిపించాను. ఫోనులో అప్పటి కప్పుడే ట్యూన్ హమ్ చేస్తూ నా పల్లవిని పాటగా మలచి వినిపించారు. ఆ పల్లవి ఆధారంగా తరువాత సాగిన నాపాట అన్నమయ్య పదాల ధోరణిలో యతి ప్రాసల బరువులు తొడుక్కొని యథాక్షర ప్రబంధ రీతికి సాగినదనుకొంటాను. అది వారికి రుచించలేదని గ్రహించాను. కృష్ణశాస్త్రిగారనే మాట గుర్తుకు వచ్చింది. పాట హాయిగా ఆకాశంలో ఎగిరే పక్షిలా ఉండాలిగానీ భారంగా నేల మీద నడిచే విధంగా ఉండరాదు. పైగా రేడియో పాటకు కాలాన్ని బట్టి కుదింపు కూడా అవసరం. మొత్తానికి నాలుగేసి పాదాలుగల మూడు నాలుగు చరణాల నామాతువు గేయగానాన్ని శ్రోతల కాలాన్నీ దృష్టిలో పెట్టుకొని కొంత కుదించగా వారి ధాతు కల్పనలో మరొక సెట్టింగులో 'ఈమాసపు రేడియో పాట' రూపు దిద్దుకొన్నది. తీరికగా చదువుకోడానికి బాగుంటుందనిపించే నా మొదటి మాతువు వారి గేయ కల్పనలో వీనుల విందుగా వినదగ్గ పాటగా రూపుదిద్దుకొన్నదంటే ఆ కీర్తి వారికే దక్కుతుంది. మంచి పాటకు విజయమన్నది కవి మీదా గేయకారుని మీదా ఎంత ఆధారపడి వుంటుందో అంతగానూ దాన్ని పాడే గాయకుల మీదా జంత్రవాద్యాల హంగులు కూర్చుకొని వారు చేసే సాధన మీదా కూడా ఆధారపడి వుంటుంది. అది ఒక



సమష్టి కృషి కృత్యాద్యవస్థ. అది చక్కగా నెరవేరినప్పుడే మంచి పాట నిజంగా పుడుతుంది.

మరి కవీ గేయకారుడూ గాయకుడూ కూడా ఒక్కడే అయి అన్నీ మిన్నందినప్పుడు, సాధన రాణించి, ఒక ఆత్మీయతను సంతరించుకొని, ప్రదర్శనంలో - అది ఆడియోలో కానివ్వండి, వీడియోలో కానివ్వండి - అందరి ప్రశంసలనూ అందుకొంటుంది. పాలగుమ్మి వారిలో మనం గుర్తించి గర్వించదగిన అంశం అదే. అందుకే వారు అన్నమయ్య పదాలు పాడినా దేవులపల్లివారి పాటలు వినిపించినా ఊరి చెరువు గట్టున కూర్చుని తత్త్వాలు, కీర్తనలు పాడినా తమ పాటలే పాడుకొన్నా అన్నీ మనోహరంగానే అనిపిస్తాయి వీనుల విందుగా వినిపిస్తాయి కంటికింపుగా కనిపిస్తాయి.

ఆ సరస్వతీమూర్తికి 81వ జన్మదినసందర్భాన ఇవే నా అభినందన చందనాలు. శుభాకామనలు.

వేటూరి ఆనందమూర్తి



From left : Sankar (Sitar), Anthony Mathews, N.S.Srinivasan, S.S.Raju, Palagummi, Emani Sankara Sastry, Royanna, Saraswathi, Sankar (Flute), J.M. Domingo, Lalgiris, Srirama Sarma, Shaik Hussain

# అజాత శత్రువు

శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారితో నాకు 35సం. పైగా పరిచయం. 1961కి ముందే వారిని గురించి నేను వినడం, వారు మంచి వైణికులని, సుప్రసిద్ధ రచయిత శ్రీ పాలగుమ్మి పద్మరాజుగారి తమ్ముడని, మంచి Composer అని తెలుసు.

నేను విజయవాడలోని ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో అధ్యాపకునిగా జేరిన (1961) సమయంలోనే (సుమారుగా) విశ్వనాథంగారు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో లలిత సంగీత ప్రయోక్త (Light Music Producer) గా రావడం జరిగింది. ఆ సమయంలో సుప్రసిద్ధ గాయకులు మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు మా కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. ఆకాశవాణిలో కూడా వారివారి రంగాలలో నిష్ణాతులైన శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు, బందా కనకలింగేశ్వరరావుగారు, వోలేటి వెంకటేశ్వర్లుగారు, పింగళి లక్ష్మీకాంతంగారు, ముసునూరి వెంకటరమణ మూర్తిగారు, శ్రీ రంగం గోపాలరత్నంగారు, ప్రయాగ నరసింహశాస్త్రిగారు ఇత్యాదులుండేవారు. విజయవాడ ఆకాశవాణిలో అదో స్వర్ణయుగం. ప్రతి విభాగంలోను శ్రోతల మనసుల్లో కలకాలం నిలిచిపోయే అద్భుత కార్యక్రమాలు రూపొందించేవారు.

పాలగుమ్మి విశ్వనాథంగారు రూపొందించిన అనేక లలిత సంగీత రూపకాలు, భక్తిరంజని కార్యక్రమాలలో పాల్గొనే అదృష్టం నాకు లభించింది. అప్పటి నుంచి మా పరిచయం దినదినాభివృద్ధి చెంది మంచి స్నేహంగా మారింది.

విశ్వనాథంగారు పదవీ విరమణచేసి సుమారు 20 సంవత్సరాలయినా ఆయన రూపంలోగాని, ప్రావీణ్యంలోగాని, ఉత్సాహంలోగాని అప్పటికి ఇప్పటికి ఏమాత్రం మార్పులేదు. ఇప్పటికీ నేను హైదరాబాదు ఎప్పుడు వెళ్లినా సాధారణంగా ఆయనతోను, మిత్రులు ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారితోను కొంత సమయం గడిపి అనేక ముచ్చట్లు చెప్పుకొనడం పరిపాటి.

విశ్వనాథంగారితో కాలక్షేపం అంటే గంటలు నిమిషాల్లా గడిచిపోతాయి. ఆయన సంగీతంలోనేకాక సాహిత్యంలోకూడా విశేష ప్రవేశం కల వ్యక్తి. మృదుభాషి. ఆయన రూపొందించిన అనేక కార్యక్రమాలలో నేను పాల్గొన్నప్పుడుగాని ఇతర సమయాలలోగాని ఆయన ముఖంలో చిరునవ్వు చెరగడం చూడలేదు. ఆయన వీణ ఎంత కోమలంగా వాయిస్తారో ఆయన పాట, మాట



కూడా అంత కోమలంగానూ ఉంటాయి. మేం కలుసుకున్నప్పుడు సంగీత విషయాలేకాక అనేక ప్రాపంచిక విషయాలూ దొర్లిపోతూ ఉంటాయి. విశ్వనాథంగారు అజాత శత్రువు, విజ్ఞానమూర్తి.

ఇక ఆయన సంగీత ప్రావీణ్యం ప్రస్తావించాలంటే ఎంతైనా వ్రాయవచ్చు. పాటలోని భావానికి సరియైన రాగాన్ని ఎన్నుకొని పాటకు మరింత శోభను మార్చడంలో సిద్ధహస్తులాయన. ఈ విషయం ఆకాశవాణి శ్రోతలకు, దూరదర్శన్ ప్రేక్షకులకు బాగా విదితమే. సాధారణంగా రేడియో పాటలు గాని, దూరదర్శన్ పాటలుగాని కంపోజ్ చేసేవారు వివాది రాగాల జోలికిపోరు. విశ్వనాథంగారు వివాది స్వరాలున్న రాగాలనెన్నో ఎన్నుకొని వాటిలో అతి సొగసైన బాణీలెన్నో అందించారు. వారిలో ఇదొక ప్రత్యేక ప్రావీణ్యం అని చెప్పాలి.

ఆయన చేసిన ఎన్నో భక్తి కీర్తనలు, లలిత గేయాలు శ్రోతల హృదయాలలో చెరగని ముద్ర వేశాయి. శ్రీమతి వేదవతీ ప్రభాకర్, శ్రీమతి ఛాయాదేవి, చిత్తరంజన్ మొదలైన వారి కంఠాలనుండి వెలువడి శ్రోతలను మైమరపించిన అనేక గేయాల సృష్టికర్త విశ్వనాథంగారు. వారి స్వీయ రచనలు కూడా ఎంతో మధురంగా ఉంటాయి.

విశ్వనాథంగారి వేలాది అభిమానులలో నేనొకడినని ఆయనకు మిత్రుడనని చెప్పుకోవడానికి నాకెంతో గర్వంగా ఉంటుంది.

ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యైశ్వర్యాలు ప్రసాదించాలని, సంగీత రంగం ఇంకా పెక్కు సంవత్సరాలు ఆయన అపూర్వ ప్రావీణ్యాన్ని చవి చూస్తూనే ఉండాలని ప్రార్థిస్తూ శ్రీవిశ్వనాథంగారికి నా హార్దిక శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను.

పెమ్మరాజు సూర్యారావు
విజయవాడ

# సారమెరిగిన వీణ

శ్రీ పాలగుమ్మి విశ్వనాథం గారు
శ్రీ స్వరాల విశ్వ, నాథం వారు
స్వరవాణి నాదమే వారి వీణ,
వీణాపాణి గానమే వారి ఆకాశవాణి,
ఆకాశవాణి కేంద్రం, వారి ఆనంద సంద్రం,
వయోపరిమితిని వారు వెడలినా,
విడువదు వారి నాకాశవాణి
భారత రోదసిలో భాస్కరునిలా
పాలగుమ్మి వారి బాణి
పాలకోవా పదరు పేణి
విశ్వనాథులవారి వీణ
విశ్వవేదన పరిత్రాణ
వారి బాణీ వారిదే, కృష్ణశాస్త్రి గీతంలా -
నట్టడవిలోనైన నడికడలిలోనైన
చవులెరిగి చెవులున్న వారనే మాటిది -
పసిపిట్ట మాటలా? పపాసా పాటలా?
సాకునేదో చెప్పి సాగి పోడానికి
వేయిపన్ల వైరైనా వేయికాళ్ల జెర్రైనా
కదులుతున్న వాడైనా కదలలేని మోడైనా
వేగిరపడి పోతున్నా ఆగిపోయి వింటారు
ఇహం మరచి ఈహ మరచి ఆహో యంటారు -
సకలంలో సంగీతం సరస్వతికి సొత్తనే,
స్రష్ట, వీణ సరస్వతీ హస్తగతం చేశాడు -
ఆమె గొంతు గానాలు ఆమనిబుతు గీతాలు -
ఆమె వీణ నాదాలు అవనిలోని వేదాలు -
ఎన్ని జన్మలుగాను ఎన్ని పూజలు చేసి,
వన్నె వీణను గోరి కన్న తల్లిని వేడి,
విశ్వనాథుడు తెచ్చె వరవీణ
వేదాల నాదాలు వినిపించు వీణ
సామ వేదపు సారమెరిగిన వీణ
విశ్వ విపంచిని విశ్వనాథునికిచ్చి,



కనుగవల నీరోడి నలువరాణి
వేడుచూ కోరెనాక వీడని కోరిక -
ఆకాశవాణిలో అతి లలిత లలిత మూ,
నీ శ్రుతులు నిలచె నిల మధుర స్మృతులుగాను;
సుధలొలుకు సురలోక సంగీత స్వరములు
ఆకాశవాణిలో నా వీణగానమును
వినిపింపలేదు నీ ఆకాశవాణి -
వీణగానాన వెలలేని బాణీలు,
లలిత సంగీతముగ మలచి నీ వీణతో,
తేట తెనుగున పాడి పాటగా వినిపించు;
వ్యధిత హృదయాలన్ని సుధలతో నిండగా,
అంతటా అతిథిగా ఆనందముండగా,
సురలోక గానమీ ధరణిలో దింపవా
మధుర సంగీత మీ మహినంత నింపవా -
విని తల్లి కోరికను విశ్వనాథుండు,
తప్పక తీర్తునని తాజేసె తపసు,
షష్టిపూర్తులులేని నిష్ఠయిన తపసు,
వారి కున్నాదిశే వేయేళ్ల వయసు -

వడ్లమాని. పార్థసారథి

# రెండు తరాల మనీషి

ఉత్తమ వ్యక్తిత్వం, ప్రతిభ, క్రమశిక్షణ, స్నేహశీలత, మానవత, ఆత్మాభిమానం - ఇవన్నీ కలబోస్తే మనముతో రూపుదిద్దుకునే మనీషి పాలగుమ్మి విశ్వనాథం. ఈ సద్‌లక్షణాలన్నీ ఆయనతో జతకట్టిన స్నేహితులందరికీ తెలుసు. అటువంటి సాన్నిహిత్యం లేని సంగీత ప్రియులకి ఆయన అందించిన సంగీత బాణీలే బహురుచి.

పాలగుమ్మి జీవితానుభవాలు, సంగీతానుభవాలూ అనేకం. ప్రతి అనుభవాన్ని ఆయన నోట విన్నప్పుడల్లా, ఓ కథనో, కథానికనో ఇంపుగా వింటున్నట్లుంటుంది. అయినా తెలిసినవారికి కూడా తెలియనిది అనన్య సామాన్యమైన ఆయన జ్ఞాపకశక్తి. విషయ విశ్లేషణా జ్ఞానం. మంచీ చెడు పసిగట్టి, మంచికి మానసికంగా పట్టంగట్టే సహృదయుడు. కల్మషాన్ని, నిష్కల్మషంగా కడిగివేయగలడు.

ఇదంతా ఆయన మానసిక సంపద, వ్యక్తిత్వం. కళాకారుడుగా కాలుమోపిన క్షణం నించీ, తనకంటూ ఓ ప్రత్యేకత సంతరించుకుని, ఇది పాలగుమ్మి బాణీ అంటూ ముద్ర వేసుకున్న అనేక గీతాలని, అస్వాదించని, సంగీతాభిమానులంటూ తెలుగునాట వుండరు.

పాలగుమ్మి రెండు తరాల మనిషి. శాస్త్రీయ సంగీత సాంప్రదాయాలు తెలుగునాట నాటుకున్న రోజులనించి ఆ ప్రవాహం మధ్యలో ఈదుతున్న వ్యక్తి. పాతకొత్తల వారధి. ఉత్తమాభిరుచితో, ఉత్తమ మార్గాన్ని తొక్కి, అత్యుత్తమ సంగీత, వాగ్గేయకారుల మధ్య మసిలి, తన సంగీత జీవితానికి, నాణ్యమైన బాట వేసుకున్న పాలగుమ్మికి ఎనిమిది పదులు. అందుకే రెండు తరాలన్నది. ఆమాటకొస్తే మూడుతరాల సంగీతకారులందరిని చూసి, మంచిని గ్రహించిన వాడు.

పాలగుమ్మి విశ్వనాథం అనగానే పాలగుమ్మి పద్మరాజు జ్ఞాపకానికి రాకమానరు. ఈ పద్మరాజు సాహిత్యరంగంలో ఎంతటి ముద్రవేసుకున్నారూ అంటే విశ్వనాథంగారిని తెలిసిన సాహిత్యాభిమానులు అప్పుడప్పుడు ''పాలగుమ్మి" తర్వాత విశ్వనాథం అనబోయి, పద్మరాజు అన్న సందర్భాలున్నాయి. ఈ మాట ఆయనా అంటారు. ఈవిషయం ప్రస్తావించడానికి కారణం పాలగుమ్మి వంశీకుల



సహజ ప్రతిభను చెప్పడానికే సాహిత్య సంగీతాలు వీరిద్దరికీ పూర్వీకులవించీ అబ్బినవే.

రోజులు మారిపోతున్నాయి. మనుషులు మరుగున పడుతున్నారు. తెలుగు జీవన స్రవంతిలో ప్రతి యుగాన్ని అలంకరించిన సాహిత్య సంపద మాయమయి పోతోంది. స్వాతంత్ర్య సమరాన్ని ఉత్తేజ పరచిన ఆనాటి కవి పుంగవుల, స్వాతంత్ర్య సమరయోధుల పాటలు మరుగునపడ్డాయి. తెలుగు పండుగలను, వేడుకలనూ అలరించిన అనేక పాటలు ఇప్పుడు వినపడవు. ఈ ఆవేదన కొందరికున్నా, గతాన్ని తవ్వి ఆనాటి బాణీలతో ఆ పాటలన్నీ మనకందించగల శక్తి పాలగుమ్మి విశ్వనాథానిది మాత్రమే. అందుకే ఆ గతాన్ని, ఈ తరానికీ, భవిష్యత్తరాలకీ అందివ్వగల శక్తి పాలగుమ్మిది.

గాంధీజీనే మరచిపోతున్న ఈ రోజుల్లో ఆ మహాత్ముని జ్ఞాపకాలను, ఆయన అడుగుజాడల్లో నడిచిన స్వాతంత్ర్య సమరయోధుల రచనలను పాడి, పాడించి, కేసెట్లుగా మన మధ్య నిలిపారు పాలగుమ్మి.

శాస్త్రీయసంగీత పునాదిపై, లలితసంగీత బాణీలని సమకూర్చి, ఎందరో గొప్ప రచయితల పాటలకు అందాలు అద్ది పది కాలాలపాటు నిలిచే శక్తిని సమకూర్చిన ఘనత పాలగుమ్మిది. ఈ వరుసలో చెప్పుకోవాల్సింది దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనలని. ఆకాశవాణిలో ప్రారంభమైన వీరి సంగీత, సాహిత్యయజ్ఞం, అనేక పాటలు, రూపకాలను హవిస్సుగా సంగీత ప్రియులందరికి పంచిన తీరు మరువలేనిది. ఇదో రకమైన సాహితీ సంగీత జంట. కాగా, తన సహజకవి హృదయానిపై దేవులపల్లి ప్రభావం ఉండడంతో పాలగుమ్మి విశ్వనాథం స్వయంగా రాసి, తన సంగీతబాణీలలో వినిపించిన గీతాలు అనేకం. ''అమ్మదొంగా......." ఈ వరుసకి తలమానికం వంటిది. అటువంటిదే ''మావూరు" పాట ఈ రచనలన్నీ ఓవిధంగా - స్వానుభవం నుంచి పుట్టుకు రావడంతో, శాశ్వతత్వాన్ని సముపార్జించినవి. ఆకాశవాణితో, తనకున్న అవినాభావ సంబంధాన్ని తెలియపరచే పాట - తను పదవీ విరమణ చేస్తున్న దశలో రచించినది మరొకటి. అనేక సందర్భాలను పురస్కరించుకుని, రచించిన గేయాలెన్నో వున్నాయి.

పాలగుమ్మికి ప్రత్యక్ష, పరోక్షాభిమానులెందరో. తన సంగీతం, వాటి సాహిత్యం ముందు తరానికి అందించాలన్న తపనలో కేసెట్లలో పాటలని పొందుపర్చడమే కాకుండా, అనేక శిష్య ప్రశిష్యులను తయారుచేసే పనికీ పూనుకున్నారు. శాస్త్రీయ సంగీతాన్ని పదిమందికీ పంచుతున్నారు. నిజానికి

పాలగుమ్మి శాస్త్రీయ సంగీతాన్ని, వీణ పట్టి ఈమని శంకరశాస్త్రిగారి నుండి నేర్చుకున్నా, ఆయన సహజసిద్ధమైన గాయకుడు. నాకప్పుడప్పుడు అనిపిస్తుంది - పాలగుమ్మి ప్రారంభం నించీ - కర్ణాటక సంగీత గాయకుడుగా తన ప్రయత్నాలనారంభిస్తే - వేళ్ళపై లెక్కపెట్టదగ్గ బహుకొద్దిమంది ప్రఖ్యాతగాయకుల సరసన వుండేవాడు. ఆయన గాత్ర ధర్మం బహుగొప్పది. అప్పుడప్పుడూ ఆయన ఇచ్చిన గాత్ర కచేరీలే అందుకు సాక్ష్యం. వీణపట్టినా గాత్రంతో పాడినా సంగీతం సంగీతమే. దాని వన్నె తగ్గదు.

అయితే, పాలగుమ్మి లలిత మార్గాన్ని పట్టడం ఒకందుకు మంచిదనిపిస్తుంది. కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసుడుగా ఉన్న కొద్దిమందిలో ఒకరుగానే మిగిలిపోయే వారు. కానీ, లలిత సంగీత ప్రపంచంలో ఆయనదిప్పుడు ప్రథమస్థానం. అంతేకాదు లలితసంగీత రూపురేఖలని చిరస్థాయిగా నిలిపారంటే - దానికి, శాస్త్రీయ సంగీత పునాదిపడాలన్న సిద్ధాంతానికి, పాలగుమ్మి ప్రతీక. ఆయన సంగీత భావనాజలధిలో - అనేకమంది ప్రముఖ కవుల గీతాలకు శాశ్వతత్వాన్ని కలిగించే అవకాశం ఆయన సంగీత రచలనద్వారా కలిగించారు. అంతేగాక, పోగొట్టుకున్న అనేక గీతాలను వెలికితీసి పదిమందికీ పంచగలిగారు. ఈ రోజున పాలగుమ్మికి ప్రత్యక్ష శిష్యులు కొద్దిమందైనా, పరోక్ష శిష్యులు అనేకమంది.

పాలగుమ్మి అనుభవం అపారం. భావకవిత్వంతో పాటుగా సమాంతరంగా, సంగీత ప్రపంచంలో కాలుమోపిన వ్యక్తి. అందుకే భావకవితాధారకి, ఉత్తమ గీతాలకి, పాలగుమ్మి సంగీతం ఊపిరిపోసింది. పాట, సంగీతం జోడుగుర్రాలవంటివి. రెండూ సమవుజ్జీలయితేనే - ఆ పరుగు అందంగా వుంటుంది. అందుకే - పాలగుమ్మి తన సంగీతంతో తన ప్రతిభనీ కవుల రచనా ప్రౌఢిమని ఒకేచోట కట్టి, తనతోపాటుగా తనపాటలు రాసిన కవులందరికీ కీర్తి ప్రతిష్ఠలార్జించిపెట్టారు. సంగీత దర్శకుడుగా అందరి మన్ననలనూ అందుకున్నారు. పాత తరం కొత్త తరానికి స్ఫూర్తి అను నానుడిని అక్షరాలా నిజం చేసిన పాలగుమ్మి - అన్ని తరాలకు వారధి. పైన పడుతున్న వయస్సుని సైతం ఓడించి, భావుకుడుగా సంగీతవేత్తగా ఉత్తమ మానసిక సంపదగల భాగ్యవంతుడిగా - ఈనాటికీ పాలగుమ్మి యువకుడే. ఎనభైయ్యేళ్ళు దాటిన నవ యువకుడు. లలిత సంగీత స్రష్టగా పాలగుమ్మి కీర్తిప్రతిష్ఠలు అజరామరం.

గుడిపూడి శ్రీహరి



# లలిత సంగీతానికే వన్నె తెచ్చిన గురువుగారు

అది 1954వ సంవత్సరం. నేను ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. ఆకాశవాణిలో సంగీతానికి కొత్తగా ఆడిషన్ నిర్వహిస్తున్న రోజులు. లలిత సంగీతానికి నిర్వహించిన ఆడిషన్‌లో సెలక్ట్ అయి ఖైరతాబాదులో వున్న ఆకాశవాణి స్టూడియోలో ఒక రోజు సాయంత్రం 6.45 నుండి 7 గం.ల వరకు ప్రసారమయ్యే లలితసంగీత కార్యక్రమంలో పాడడానికి వెళ్ళాను. అప్పుడన్నీ live programmes గానే వుండేవి. ఆ రోజు కార్యక్రమంలో వాద్య సహకారం అందించిన నిలయ విద్వాంసులలో వైణికులుగా పరిచయమయ్యారు శ్రీ పాలగుమ్మి విశ్వనాథంగారు. నాతో కూడా వచ్చిన మా అమ్మగారితో ఆయన ''మీ అబ్బాయిది చాలా మంచి గాత్రం. సంగీతం చెప్పించండి" అని అన్నారు. ఆ తరువాత కొద్దికాలానికి సి.నారాయణరెడ్డిగారు రచించిన ''వెన్నెలవాడ" సంగీత నృత్యరూపకం Exhibition Grounds లో తెలంగాణా రచయితల సంఘ వార్షికోత్సవాలలో ప్రదర్శించినప్పుడు అందులో విశ్వనాథంగారు నాచేత పాడించారు. అప్పటి నుంచి ఆయన సంగీతం సమకూర్చిన దాదాపు అన్ని కార్యక్రమాలలోను నాచేత పాడిస్తూ నన్ను ఎంతో వాత్సల్యంతో పైకి తీసుకువచ్చారు. ఎన్నెన్ని పాటలు! ఎన్నెన్ని మంచి మంచి సంగీత రూపకాలు రేడియోలో ప్రసారమయ్యేవి! ఆ రోజులు తలచుకుంటూ వుంటే ''కడచిన దినాలు సుఖపూరితాలు - మధుర స్వప్నమో మలయమారుతమో" అన్న రజనిగారి పాట గుర్తుకు వస్తూ వుంటుంది.

సుమారు 1956లో ఆకాశవాణి హైదరాబాదు స్టేషన్‌లో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, మునిమాణిక్యం నరసింహారావుగారు, స్థానం నరసింహారావుగారు మొదలైనవారు ప్రొడ్యూసర్లుగా నియమితులయ్యారు. "భువనవిజయం" లాంటి దర్బారు వలె నిష్ణాతులయిన పండితులతో ఆకాశవాణి వెలుగొంద సాగింది. బాలమురళీకృష్ణగారు కూడా కొద్దికాలం ఇక్కడ పనిచేశారు.

రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావుగారు, అక్కయ్య కామేశ్వరమ్మగారు, ప్రతి పండుగకీ పబ్బానికీ ఇటు పిల్లలకీ అటు మహిళలకీ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేవారు. అన్నిటిలోనూ విశ్వనాథంగారి సంగీతం వుండేది. కృష్ణశాస్త్రిగారు రేడియోకి ఎన్ని పాటలు, సంగీత రూపకాలూ రచించారో! వాటన్నిటికీ విశ్వనాథంగారు పగలనక రాత్రనక ఆయనతో కూడా ఉంటూ అద్భుతమైన సంగీతాన్ని అందించేవారు. పాటలు Compose చేస్తున్నప్పుడు

కృష్ణశాస్త్రిగారింట్లో విశ్వనాథంగారితోపాటు తరచూ నేను కూడా ఉంటూ ఉండేవాణ్ణి. శాస్త్రిగారు రాసిన మాటలకు విశ్వనాథంగారు tune చేస్తే అది నేను పాడుతుండేవాడిని. అలా సంగీత దర్శకుడితో కలిసి కూర్చుని శాస్త్రిగారు పాట రాసేవారు కాని, విడిగా పాట రాసేవారు కారు. ''కొత్త కోవెల'' ''రాజఘట్టం'' ''ఏడాది పాడుగునా'' ''శివక్షేత్రయాత్ర'' ''పల్లకీ బోయీలు'' - ఇలా ఎన్నెన్నో సంగీత రూపకాలకు విశ్వనాథంగారు కూర్చిన బాణీలు, ఆ పాటలు ఎన్నటికీ మరపురానివి. కలకాలం నిలిచిపోయేవి.

సుప్రసిద్ధ గాయని శ్రీమతి వక్కలంకసరళ, నేను ఆయన నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలలో పాడుతూ ఉండేవాళ్లం. మా చెల్లెలు శాంత ఆయన చేసిన ఎన్నో మంచి పాటలు పాడింది. మా అమ్మగారు, నాన్నగారు మా కుటుంబ సభ్యులందరికీ ఆయనతోటి, వారి శ్రీమతి సుమతిగారితోటి ఎంతో సాన్నిహిత్యం వుండేది. నన్ను వారిద్దరూ కన్నబిడ్డలాగా ఎంతో ఆప్యాయంగా చూసుకునేవారు. అది నేనెన్నటికీ మరువలేనిది.

1958లో సి.నారాయణరెడ్డిగారు రచించిన 'రామప్ప' సంగీత రూపకానికి బాలమురళిగారు, కమలా చంద్రబాబుగారు నటించి పాడారు. ఆ కార్యక్రమంలో నేను, ఎ.వి. సావిత్రి, వి.వసంత కూడా పాడాము. దానికి విశ్వనాథంగారి సంగీతం ప్రాణం. అద్భుతమైన tunes అందించారు. నాటరాగంలో 'ఈ నల్లనిరాలలో', సింహేంద్రమధ్యమంలో 'నాగీ ఆడవే' గౌరీమనోహరిలో 'ఏనాటిదో మనబంధం' మొదలైన మనోజ్ఞమైన గేయాలను రూపొందించారు.

'భక్తిరంజని' కైనా ప్రత్యేక లలిత సంగీతపు స్టేజి కార్యక్రమాలకైనా, రిపబ్లిక్ దినోత్సవం, స్వాతంత్ర్యదినోత్సవం మొదలగు ఏ సందర్భానికైనా విశ్వనాథంగారు సంగీతం కూర్చిన గేయాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి.

లలితసంగీతంలో సాధారణంగా ఉపయోగింపబడని ఎన్నో రాగాలలో విశ్వనాథంగారు బాణీలను కూర్చేవారు. లలిత సంగీతానికి కల్యాణి, మోహన, హిందోళ మొదలగు కొన్ని రాగాలే అనుకూలంగా ఉంటాయనే ఒక అభిప్రాయం ఆరోజులలో సంగీత దర్శకులకు ఉండేది. కనుక సినిమాలలో కూడా వాడుకలో ఉన్న పది పదిహేను రాగాల్లోనే బాణీలు కూర్చేవారు. అలా చేయడం వలన కొంతకాలానికి సంగీతదర్శకుడు తన tunes ను తానే repeat చేసుకునే పరిస్థితి ఎదురౌతూంటుంది. కనుక విశ్వనాథంగారు ఎన్నో ఫక్తు శాస్త్రీయసంగీతపు గమకవరియిక రాగాలు - షణ్ముఖప్రియ, నాటకురంజి, నాట, శహన,



సింహేంద్రమధ్యమం, పూర్వీకళ్యాణి, షడ్విధమార్గిణి మొదలగు వాటిని లలిత సంగీతానికి ఉపయోగించి ఎంతో వినూత్నమైన మనోరంజకమైన బాణీలను కూర్చారు. ఆవిధంగా లలిత సంగీతకళకే వన్నె చేకూర్చిన వారయ్యారు ఆయన.

నేను ఆయనకు పరిచయమైనప్పటి నుంచీ ఎంతో వాత్సల్యంతో ప్రతి కార్యక్రమంలో నాచేత పాడించడమే కాక, లలిత సంగీతంలో నాకు అపారమైన శిక్షణ నిచ్చిన గురువుగారు శ్రీ పాలగుమ్మిగారు. నేను Music Composer కావడానికీ, నాకు రేడియోలో ఉద్యోగం రావడానికీ ఆయనే కారణం. శిష్యులకు విద్య నేర్పడమే కాక వెన్నంటి ఉండి వారికి అడుగడుగునా సలహాలనూ, చేయూతనూ ఇచ్చి ముందుకు నడిపించే గురువులు అరుదుగా ఉంటారు. కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో నాకు అటువంటి సద్గురువు శ్రీ బాలమురళీకృష్ణగారైతే లలిత సంగీతంలో విశ్వనాథంగారు నాకు అటువంటి గురువు. వారి వాత్సల్యానికి నేను పాత్రుడను కాగలగడం నా అదృష్టం.

వారు 80 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ శుభసందర్భంలో వారికి వినమ్రుడనై ప్రణమిల్లుతున్నాను.

ఎం. చిత్తరంజన్



N. Raghava Rao, N.C. Satyanarayana, V.V.Kanakadurga, Chittaranjan, Rathan Prasad, R.Hanumantha Rao, D.Krishna Sastry, Sarada Srinivasan, Vakkalanka Sarala, Pakala Savitri, A.V.Savitri, Palagummi, N.S.Srinivasan.

# మా మాష్టారు

'నమస్కారం ..... మాష్టారూ ......' అనగానే
ఆయన పెదవిపై ఓ చిర్నవ్వు విరికూన వికసించి
చర్మంలోంచి గుండెను తడుముతుంది.
అంతే !
'ఏవోయ్ కులాసా?' అంటూ మొదలై
ఎన్నో ఖబుర్లతో
ఓ రెండు మూడు గంటలు చులాగ్గా అట్టే గడిచిపోతాయి.
ఆ ప్రవాహంలో ఒకోసారి ఊపిరిసలపదు.
ఒక్కోసారి కాలానికి సమయం తెలీదు.
ఈప్రపంచ జీవిత సంపూర్ణత్వంతో కలిసి జీవించి .....
ప్రేమనూ విరహాన్నీ, ఆనందాన్నీ విచారాన్నీ
దానికి ఇచ్చిన తృప్తితో కనిపిస్తారాయన.
పచ్చిక మీదనించి ఎండలో పైకిలేచే
వెచ్చని విశ్వాసమల్లే అనిపిస్తారాయన
తెల్లటి జుట్టుతో
నిదుర తొడిమపై ఊగే నాజూకు కలలా
నేలకు నొప్పి కలగకుండా
మెల్లగా.... మెత్తగా అడుగులేసుకుంటూ
మాష్టారు వెళ్తూ ఉంటే -
అదో జ్ఞాపకాల ఊరేగింపు !
మా అందరికీ అది ఆహ్లాదయాత్ర....
ఎంచాతంటే -
ఒక గోపీకృష్ణ అద్భుతమైన నృత్యభంగిమ
మాష్టారి మాటల్లో మా కళ్లముందు నిలుస్తుంది.
అలానే -
ఆనోటా ఆనోటా వినడమేగానీ
చూడ్డానికి నోచుకోని మాకు
అలత్తూర్ సోదరుల గానం, రాజరత్నం పిళ్లై నాదస్వరం,
కృష్ణశాస్త్రిగారి కవితాగానం మొదలైనవి
మాష్టారి నోటివెంట వినడం - ఒక అనుభూతి



ఆతర్వాత, ఈమని శంకరశాస్త్రిగారు
మరోపెద్ద సబ్జక్ట్
ఈయన మా మాష్టారి మాష్టారు మరి !
మాష్టారి దగ్గరికెళ్తే చాలు -
ఆయన అనుభవాల వింత పరిమళం
మనచుట్టూ అలుముకుంటుంది.
విశ్వనాథం మాష్టారి సంగీత యాత్రలో
కొన్ని పాటల పల్లకీలు మోసిన బోయీని నేను.
ఆయన సంగీత మధుర ధ్వనులలో పరిమళించిన
ఆరోజుల పువ్వుల గంపల్ని మోసే వాడిని మాత్రమే నేను.
అందుకే, నా ఈ కాస్త జీవితపు జ్ఞాపకాల తెరల్లోంచి
మాష్టారి వైపు చూసే ఈ ప్రయత్నం.
ఆ రోజుల్లో ఎంతమంది గాయకులు
విశ్వనాథం మాష్టారి సంగీతంలో తమ గొంతులేరుకోలేదు
చిత్తరంజన్, వక్కలంక సరళ, కెబికె మోహన్‌రాజు,
వేదవతీప్రభాకర్, నర్శింహమూర్తి .....
ఇలా ఎందరో రేడియో ద్వారా popular అయిన వారే.
సంగీతం దప్పికతో వచ్చిన వారందరికీ
వీణ మీటి దాహం తీర్చే వారట మాష్టారు.
దాహం తీరిన ఆ గొంతుల్లో తన పాటల సుధలు పోసి
ఆ గాత్రాన్ని తీర్చిదిద్దే వారట.
అందుకే ఆ గాత్రాలనించి వెలువడ్డ ప్రతిపాటా
ఓ తరవాణి ముద్ద.
'పదములె చాలు రామా', 'రాలలోపల పూలు పూచిన
రామమందిర లీల', 'స్వాతంత్ర్యమె నా జీవితాశయని',
'షాదీ యీ దేశం', 'నీ అడుగులేకాక నిరుపేద బతుకునకు
ఏపిడుగడ కలదురా' - ఇలా ఎన్ని పాటలని చెప్పమంటారు.
తెలుగుదేశంలో విశ్వనాథం మాష్టారి పాటల
తరవాణి ముద్దల రుచి తెలీని ఇల్లు లేదేమో !
లలిత. సంగీతం పట్ల రుచినీ, అభిరుచినీ
యువకుల్లో కల్పించడానికి విశ్వనాథంగారు
రూపొందించిన కార్యక్రమాలు అనేకం.

సంగీత రూపకాలూ, ఈ మాసపు పాటలే కాకుండా
రసతరంగం, అనే లలిత సంగీత సంచికా
కార్యక్రమం చాలా రసవత్తరంగా ఉండేది.
అలానే, ఆహూతుల సమక్షంలో ఆకాశవాణి నిర్వహించే
లలిత సంగీత కార్యక్రమాలు
రవీంద్రభారతి రసజ్ఞులతో నిండిపోయేది.
అదో గొప్ప దృశ్యం.
వాద్యాలలో stage నిండి ఉండేది.
మధ్యలో గాయకులు వారిని direct చేస్తూ మాస్టారు.
పక్కనే, మాస్టారికి assist చేస్తూ చిత్తరంజన్ గారు.
ఇవన్నీ చూస్తూ, ఏనాడైనా నేనూ ఈ రేడియో
స్టేషన్‌లోనే ఉద్యోగం సంపాదించి వీళ్లందరితో
కలిసి పనిచేయాలనుకొనే వాడిని.
అయితే, నేను ఆకాశవాణిలో చేరే సమయానికి
చాలామంది ముందుతరం వాళ్లు రిటైర్ అయిపోయారు.
అయినా, డైభైల్లో మేమంతా casual artists గా
వచ్చే రోజుల్లో అనుభవాలు మరిచిపోలేను.
విశ్వనాథం మాస్టారి రికార్డింగు అంటే ఓ ఉత్సవం.
ఎప్పుడూ Music-II Studio సంగీత కళాకారుల్తో
కళకళలాడుతూ ఉండేది.
విశ్వనాథం మాస్టారి పాటలు వినడం వరకే తెలుసుముందు.
మెలోడీని అస్వాదించడం వరకే..... అంతే !
అయితే, ఆ తరువాత్తరువాత
చిత్తరంజన్‌గారు విశ్వనాథం మాస్టారి
ఒక్కోపాటనీ - సంగీత పరంగా, సాహిత్యపరంగా
విశ్లేషించి చెప్తుంటే
'విశ్వనాథం గారి లోకి' చూడడం ప్రారంభించాను.
అలా చూడ్డంలో ఒకే ఒక్క విషయం తెలిసింది.
మాస్టారి పాటలు ఏదో కడుపు నింపేవి కావు
ఆకలి తీరుస్తాయి.
అమ్మ ఒళ్లో ఒత్తిగిల్లి కలలు కన్న తృప్తినిస్తాయి
అందుకే



జనాల మనోగగనంలో చాపుకొన్న జ్ఞాపకాల కొమ్మలపై
గాధానురాగాల ఊడలపై
ఆయన పాటలు ఊగుతూ తూగుతూ ఉంటాయి ఎప్పుడూ.
ఆ రోజుల్లో
ఊరేగివచ్చే ఉత్సవాల్లో మాస్టారు వస్తూంటే
ఉత్సాహాలు కొనుక్కోడానికి కళాకారులంతా వచ్చేవారు.
78లో అనుకుంటా - కోపల్లె శివరాం రాసిన
'స్వాతంత్ర్య మనేమి తాతా - అది కాపాడు కొనుటెందు
చేతా? ' అనే పాట నా సంగీత దర్శకత్వంలో
విశ్వనాథంగారు పిల్లల్తో కలిసి పాడటం -
ఓ పెద్ద న్యూస్.
అందుకే, అప్పుడప్పుడు
నాకు మాస్టారి పక్కన నడిచేటప్పుడు
అందరి వంకా గర్వంతో
కూడిన చూపులు
సంధిస్తుండేవాడిని.
నాకు తెలిసిన విశ్వనాథం గారికి
Inhibitions లేవు. Obsessions అసలే లేవు.
ఎవరు చేసినా పాట బావుండాలి.
Melodious గా ఉండాలి.
అది మాస్టారి పెదవి పైకి చేరిందా -
గాయకుడు, సంగీతదర్శకుడూ ధన్యుడైనట్లే.
రేడియోలోనూ బయటా కూడా
లలిత సంగీతానికి ప్రాచుర్యాన్నీ వైభవాన్నీ కల్పించి
ఒక ఉన్నత స్థాయికి తీసుకెళ్ళింది మాస్టారే.
ఏ కాలం వారైనా
భావుకులు తమ కవితా నైపుణ్యాన్ని ఎక్కడ అర్పిస్తారో
అమర గాయకులు యుగయుగాలు
ఒకరినొకరు ఏ పేర్లతో గుర్తిస్తారో
అక్కడ మా విశ్వనాథం మాస్టారికి స్థానం ఉంది.

కృష్ణమోహన్

## PALAGUMMI VISWANADHAM - REMINISCENCES

**I** heard of Sri Palagummi Garu in the late Forties when in Mr.S.N.Murthi's room at AIR Madras, his famous writer brother was discussing Mr.Vishwanadham's chances of being employed in AIR. After that we used to come across each other occasionally by chance when he came to AIR or in the company of Sri Emani Shankara Shastri.

In Mid 1955, I was transferred to Hyderabad AIR as Programme Assistant incharge of Carnatic Music and Telugu programmes.

Carnatic Music was poorly represented on the staff of AIR Hyderabad (just 3 Violinists & Mrudangists) as Hyderabad was still to come out of the Nizam's influence. In such circumstances light music occupied a very low place in our programmes.

About the end of 1955, we had a programme of Gurujada's poems. I invited Sri Palagummi to compose music of three of his poems. The result (which was sung by me with Varalakshmi) still echoes in my ears and in Nostalgic moments I still tune

"ఈ తమ్మలపు మ్రుదలు, జలజల మని, చూడచూడ నీ రూపము"

The last piece in Begada caught the attention of our director Sri N.V.Rajagopal and he discussed with me the argumentation of the Carnatic Music Staff. As a result, Sri Palagummi also with Parthasarathy & S.S.Raju were employed on casual 15 day contracts. As part of the 2500th Annivessary of Buddha, the late Sri Rajasekhar wrote a poem and asked me to set it to music & sing it (I was a composer of sorts those days). Sri Palagummi improved the composition with suggestions and alterations and participated as an accompanist.

The real break came when I commissioned him to set to music Padmashree Dr. C.Narayan Reddy's music of the play Vennala Vaada. It was a big hit and was made into a ballet. Noteworthy were his pieces in it in Ranjani and Behag. On the



basis of his success, Sri Vishwanadham was appointed on the staff and formed the nucleus of the Telugu Light Music Unit.

Thus ended our First Period of Association. I was transferred to Delhi in 1957 but never lost track of Sri Vishwanadham. His successes as a composer confirmed him as one of the stars of Telugu Light Music. When I joined as Director in Hyderabad in 1973 Sri Vishwanadham was Light MusicPproducer and was one of the very well known personalities of Hyderabad.

He was responsible for a special programme called the Song of the Month' which he composed and sometimes also wrote the words.

Sri Palagummi and I had a special relationship because of our devotion to the Tradition in Carnatic Music and our high regard and affection for the late Sri D.V.Krishna Sastry.

The Peculiarity of Sri Palagummi was his ability to grasp an idea thrown off and his expansion of it and in depth understanding of its possibilities. You never had to explain to him what you actually wanted because he had already anticipated you. The programme he produced were Myriad and would take too long to enumerate.

His 'Amma Donga', 'Kanna Katha Cheppamma' and D.V. Krishna Sastry's poems are easily the best I have heard in the field of Non film light music.

A Multi faceted personality, interested in Music, songs in other languages, interest in old Traditions and old world musicians have endeavoured him to one and all. A conversation with him by itself was an education in Music.

May he live long and contribute to the great legacy of Telugu Light Music.

***T. R. MURALIDHARAN***

# నా సంగీత యాత్రా మజిలీలు

సంగీత లోకంలో అడుగుపెడతానని గాని, సంగీతాన్ని వృత్తిగా స్వీకరిస్తాననిగాని, నేను ఎప్పుడూ అనుకోలేదు. అయితే సంగీతం మీద ఆసక్తి మాత్రం చిన్నప్పటినుంచీ ఉండేది. మా బామ్మ, అమ్మ రామదాసు కీర్తనలు, తరంగాలు, సుభద్రా పరిణయం, ఊర్మిళాదేవి నిద్ర - ఇలాంటివి ఎన్నో శ్రావ్యంగా పాడుతుండే వారు. అర్థం తెలియకుండానే ఆ పాటల్లో నా మనస్సుని పట్టుకున్న కొన్ని పంక్తులు పాడుతుండే వాడిని. కపిలవాయి రామనాథశాస్త్రి, జొన్నవిత్తుల శేషగిరిరావు, తుంగల చలపతిరావు, వీరు నాటకాల్లో పాడే పద్యాలు, పాటలు పాడుతుండేవాడిని.

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడం వల్ల, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేక పోవడం వల్ల స్కూల్ ఫైనల్ అవగానే (S.S.L.C.) చదువు మానేశాను. అప్పుడు నాకు 17ఏళ్ళు. రెండేళ్ళు ఊరికేనే తిరిగాను. టైపు నేర్చుకున్నాను. హయ్యర్ పరీక్షకూడా ప్యాసయ్యాను. ఉద్యోగం ఏదీ దొరకలేదు. ఇంతలో మా అన్న పద్మరాజుకి కాకినాడ కాలేజీలో ఉద్యోగం వచ్చింది. కుటుంబం అంతా కాకినాడ చేరాము. నాలో ఉన్న ఆసక్తిని గమనించిన మా అన్న ''పోనీ సంగీతం నేర్చుకోరా'' అని ప్రోత్సహించాడు. ఒక సంగీతం మాస్టారు గారి వద్ద చేరి రెండేళ్ళు నేర్చుకున్నా. రెండు బైండు పుస్తకాలు నిండి పోయాయి. వర్ణాలతోటి, కీర్తనలతోటీ నా అదృష్టంకొద్దీ ఆ సంగీతం మేస్టారు ఈ ఊరు వదలి వేరే ఊరు వెళ్ళి పోవలసి వచ్చింది. అప్పుడే మల్ల సూర్యనారాయణ మూర్తిగారు అన్నామలై యూనివర్శిటీ సంగీత కళాశాలలో 'సంగీత భూషణ' పట్టం పుచ్చుకొని కాకినాడ తిరిగి వచ్చారు. ఆయన్ని ఆశ్రయించాను. ''పద్మరాజుగారి తమ్ముడివా ! ఎక్కడ నేర్చుకున్నావ్? ఏమేమి నేర్చుకున్నావ్?'' వగైరా ప్రశ్నలు అయిన తర్వాత ''ఏదో ఒకటి పాడు నీ శ్రుతి ఎంత?'' అంటూ తంబూరా తీశారు. ''నాశ్రుతి అయిదున్నరండి'' అన్నా. ఒక్క క్షణం ఆగి నాముఖం కేసి చూస్తూ - అయిదున్నర ఏమిటి! అది ఆడవాళ్ళశ్రుతి. మొగవాళ్ల శ్రుతి ఒకటిగాని ఆపై శ్రుతులుగాని ఉంటాయి. నీకు చెప్పిన వాడెవడికో గొంతు లేక ఒకటి శ్రుతి పలికి చావక వాడికి పలికే శ్రుతిలోనే నీకు చెప్పి, నీ గొంతుకను తగలబెట్టేశాడు. ఈ తంబూరా శ్రుతి వేస్తాను. ఇది ఒకటిలో ఉంది. ఈ శ్రుతిలో గొంతు కలిపి పాడు. నేను ఏదో పాడాను. ఫర్వాలేదు. గొంతుక పూర్తిగా తగలెయ్యలేదులే. పై స్థాయి స్వరాలు పాడడానికి కొంత ఇబ్బంది పడుతున్నావ్! గీతాలు స్వరజతులు వర్ణాలు ఈ శ్రుతిలో సాధకం చేసి ఓ నెల తర్వాత రా! నెల తర్వాత మళ్లా వెళ్లా,



''ఊ! బాగుంది! కీర్తన మొదలు పెడతాను, కాని ఒక విషయం - వెనక నేర్చుకున్నదంతా బుర్రలోంచి తుడిచేసెయ్ !'' అని మొదలు పెట్టారు. అల్లా మల్ల గారి వద్ద నా సంగీత శిక్షణ సాగింది. మొదటి సారిగా కర్ణాటక సంగీతంలోని 'రుచి' ని నాకు అందచేసిన మహనీయుడు మల్ల సూర్యనారాయణమూర్తిగారు. తప్పు త్రోవలో పడి నడుస్తున్న నాకు సాంప్రదాయ శాస్త్రీయ సంగీత రీతులు తెలియచెప్పిన సద్గురువు మల్లగారు. ఆయనకి ఎంతైనా ఋణపడి వున్నాను. నాకు సౌలభ్యమైన గాత్రం ఉన్నా, 'వీణ' అంటే ఎంతో యిష్టం. ఈ విషయం 'మల్ల' గారితో జంకుతోనే అన్నా ''నాకు వీణ కూడా నేర్చుకోవాలని ఉందండీ!'' ఆయనది పెద్ద మనసు వెంటనే ''శెభాష్! అయితే పద మన శంకరం ఇక్కడే ఉన్నాడు.'' అని నన్ను తీసుకువెళ్ళి ఈమని శంకరశాస్త్రి గారికి పరిచయం చేశారు. శంకరశాస్త్రి గారు వెంటనే ''రేపు మంచిరోజు, వచ్చెయ్యండి'' అన్నారు. ఆయనా నేను ఇంచుమించు ఒకే వయస్సు వాళ్లం 'నన్ను అండీ' అనవద్దని ఎన్నిసార్లు చెప్పినా నన్ను ఎప్పుడూ 'విశ్వనాథంగారూ!' అని పిలిచేవారు. వయస్సు ఒకటే అయినా ప్రావీణ్యంలో ప్రతిభలో నేను ఊహల్లో కూడా అందుకోలేనంత శిఖరాగ్రాన్ని అధిరోహించి ఉన్న మహోన్నత కళాకారుడు ఈమని శంకరశాస్త్రిగారు. ఆయన బాల మేధావి (Prodigy) 11వ ఏటనుంచే వీణ అమోఘంగా వాయించేవారు. ఆయనను చూసిన ఆ మధురక్షణం నుంచీ నాకు భక్తి ప్రపత్తులతో పాటు, ఆప్యాయమైన స్నేహబంధం కూడా ఏర్పడిపోయింది. శంకరశాస్త్రిగారిది, ప్రత్యేకమైన స్వతంత్ర బాణీ. కృష్ణశాస్త్రిగారి కవిత్వం లాంటిది శంకరశాస్త్రి గారి వీణా వాదనం. మల్లగారి దగ్గర 'గాత్రం శంకరశాస్త్రి గారి వద్ద వీణ నేర్చుకునే వాడిని'.

ఒకరు 'సాంప్రదాయాన్ని నిష్ఠతో పాటించి అనుశ్రుతంగా వస్తున్న గురుపరంపరకు చెందిన విద్వాంసుడు. ఆయన దృష్టిలో శాస్త్రీయ సంగీతంలో మిగతా ఏ సంగీత వాసనలు సోక కూడదు. ఆధునిక పద్ధతులు ఏవీ దగ్గరకు రాకూడదు.

మరొకరు రెక్కలు విప్పుకుని విశాలమైన నాదప్రపంచంలో రకరకాల నాదసౌందర్యాలు అన్వేషిస్తూ విహరించే రసపిపాసి అయిన కళాకారుడు.

ఇంతలో, ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో నిలయ విద్వాంసులుగా నియమితులై మల్లగారు 'మద్రాసు వెళ్లి పోయారు. శంకరశాస్త్రి గారు కూడా ఆయన B.A డిగ్రీ పూర్తి చేసుకుని, మద్రాసులో 'జెమిని' స్టూడియోలో చేరారు.

తర్వాత కొద్ది కాలానికి, ప్రఖ్యాత నాట్య కళాకారుడు ఉదయశంకర్ నిర్మించే 'కల్పన' చిత్రం సంగీత విభాగంలో వైణికుడిగా అవకాశం దొరికి నేనూ మద్రాసు చేరుకున్నాను. శంకరశాస్త్రిగారు, మల్లగార్ల సాంగత్యం తిరిగి నాకు లభించింది. మల్లగారు నాకు ఇంకో ఉపకారం చేశారు. అన్నామలైయూనివర్శిటీ లో ఆయన సహోధ్యాయుడైన డా.. ఎస్. రామనాథన్‌గారికి పరిచయం చేశారు. ''ఈయన దగ్గరకు పోయి, నీ సంగీతాన్ని అభివృద్ధి చేసుకో - నేను ఎక్కడో తాంబరంలో దూరంగా ఉన్నానుగా. నువ్వు అక్కడికి రావడం కష్టం - ఇతను ట్రిప్లికేన్‌లోనే ఉంటాడు." అని సలహాయిచ్చారు మల్లగారు.

రామనాథన్ గారితో పరిచయం నాకొక వరం. ఆయన విశిష్టమైన వ్యక్తి, నిరాడంబరమైన వ్యక్తి. ప్రతిభా పాటవాలు దండిగా ఉన్న కళాకారుడు. సాధారణంగా సాంప్రదాయజ్ఞులలో ఉండే ఛాందసం ఆయనలో కనిపించేది కాదు. ఆయన సంగీతజ్ఞానం అపారం. కర్ణాటక సంగీత రచనలన్నీ ఆయనకు సుపరిచితం, ప్రాచీన వాగ్గేయకారుల రచనలను విశ్లేషించి అందచందాలు ఎత్తి చూపగల విమర్శనా శక్తి, సౌందర్య దృష్టి రెండూ ఉండేవి ఆయనలో. ఆయనకు గాత్రం, వీణ - రెంటిలోనూ ప్రావీణ్యత ఉండేది. అన్నిటినీమించిన అమృతహృదయం ఆయనది. ఆయనతో గాఢమైన స్నేహం ఏర్పడింది. ఆయన దగ్గర ఎన్నెన్నో నేర్చుకున్నాను. ఆయన సాంగత్యంలో కర్ణాటక సంగీత సమగ్ర స్వరూప సౌందర్యాలు నాకు అవగతమయ్యాయి. తీరిక సమయాలన్నీ ఆయనతో గడిపేవాడిని. పెద్ద విద్వాంసుల సంగీతం కలిసి వినేవాళ్లం. ఇద్దరం 'మూర్ మార్కెట్' లో పాత గ్రామఫోన్ రికార్డులకోసం తిరిగేవాళ్ళం. గ్రామఫోన్ కంపెనీ వాళ్ళు అమ్ముడు పోని రికార్డులను తూకానికి అమ్మేస్తుండే వారు - (అవి పెద్ద విద్వాంసులవి అయినా సరే ). అవి మూర్‌మార్కెట్‌లో చవకగా దొరికేవి. ఒకసారి 'షణ్ముఖవడివు' (అంటే ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి తల్లి) వీణ రికార్డు దొరికింది. వయోలిన్ విద్వాంసుడు చౌడయ్య 4 తీగల వయోలిన్ మీద - తోడి రాగ కీర్తన ''చేసిన దెల్లమరచితివో'' అన్న రికార్డు కొన్నాం. చిత్తూరు సుబ్రహ్మణ్యంపిళ్ళై వకుళాభరణరాగం లోని ''ఏ రాముని నమ్మితివో'' - రికార్డు అక్కడే కొన్నా అప్పుడంతా ఒకటే జిజ్ఞాస. ఆలోచనల్లో కాలాన్ని గడపటంలో సంగీతం తప్ప మరో వ్యాసంగం లేదు. రామనాధన్ గారి సాంగత్యంలో నేను ఎంతో ఎదిగాను. తర్వాత ఆయన ఎంతో పేరు ప్రతిష్టలు సంపాదించు కొన్నారు. మద్రాసు మ్యూజిక్ అకాడమీ ఆయనను 'సంగీత కళానిధి' బిరుదుతో సత్కరించినది.



ఉదయశంకర్ బృందంతో పని చేసిన అయిదేళ్ళూ - అదొక అపూర్వ అనుభవం. అంతవరకు నాకు తెలియని సౌందర్యసీమల్లోకి ప్రవేశం దొరికినట్టనిపించేది. అది ఒక దీర్ఘమైన మధుర స్వప్నం. రెండు రంగాల్లో నిష్ణాతులైన ఇద్దరు మేటి కళాకారుల కళాసృష్టి దగ్గరనుంచి చూసే అవకాశం లభించింది. నృత్యానికి పర్యాయపదం చెప్పాలి అంటే అది ఉదయశంకర్ అని చెప్పాలి. ఆయనపేరు ప్రఖ్యాతులు గడించుకున్నది మనదేశం కంటే విదేశాలలోనే! సృజనాత్మకత (creativity) కి ఆ దేశాలు ఇచ్చే విలువ ఇక్కడలేదు. భారతీయ నృత్యరీతులు అన్నీ ఆకళించుకుని, నవనవలాడుతూ నవ్యత చిందించే భంగిమలతో విన్యాసాలతో కనురెప్పల కదలికలో కోటి భావాలు వెదజల్లుతూ ఉండేవి. ఆయన నృత్య కల్పికలు. అనేక ఇతివృత్తాలకు నృత్య కల్పన చేసిన ప్రజ్ఞాశాలి. వాటికి 'రాసలీల' - శివతాండవం వంటి సాంప్రదాయ ఇతివృత్తాలతో పాటు - మానవ సమాజంలో వచ్చే అనేక ఘర్షణలకు ఆయన నాట్యరూపం కల్పించారు. యంత్ర యుగం వచ్చాక - మానవుడు యంత్రంలా ఎల్లామారిపోతున్నాడో - ఆ యితివృత్తంతో ఆయన రూపకల్పన చేసిన Labour Machine అన్న నృత్యం మరువరానిది.

అంతటి ప్రసిద్ధుడు ఉదయశంకర్ తో ఉండే సంగీత దర్శకుడు 'విష్ణుదాస్ షిరాలీ'. ఆయన సితార్, తబలా, తబలా తరంగ్, కాంచీ తరంగ్, కాష్ఠ తరంగ్, జల తరంగ్ - ఇల్లా ఎన్నెన్నో వాద్యాలు వాయించడంలో నిపుణుడు. ఆ వాద్యబృందలో పాశ్చాత్య వాయిద్యాలు ఒక్కటి కూడా ఉండేవి కావు వయోలిన్, క్లారినెట్, హార్మోనియం ఇల్లాంటి వేమీ కనిపించేవి కావు. సరోద్, సారంగ్ - దిల్‌రుబా, ఎస్‌రాజ్ - వీణ - వేణువు - 8 రకాల తరంగ్‌లు, ఇరవై రకాల తాళ వాయిద్యాలు, అంటే తబలా, మృదంగం - రకరకాల డప్పులు కుండవాయిద్యాలు, ఢోలక్ - ఇల్లా రకరకాల Percussion Instruments. ఈ వాయిద్యాలతో ఆయన సృష్టించిన వాద్య చిత్రాలు అజరామరాలు. లేబర్-మెషీన్ అన్న నృత్యానికి ఆయన కూర్చిన సంగీతం - కళ్లు మూసుకుని వింటే, మనం ఒక పెద్ద ఫ్యాక్టరీలో (అది పనిచేస్తున్నప్పుడు) ఉన్నట్లు ఉంటుంది. మెషీన్ చప్పుళ్లు - టక్కు - టిక్కులు - ఫాక్టరీ కూతలు - ఒక్కొక్క యంత్రం స్టార్టు అవడం - మధ్యన చెడిపోయి ఆగిపోతున్నపుడు వచ్చే రకరకాల ఫాక్టరీ ధ్వనులన్నీ కూడా ఆయన సంగీత వాయిద్యాల ద్వారానే సమకూర్చాడు.. మామూలు రాగ పద్ధతిలో పాటలకి సంగీతం ఇవ్వడం లాంటిదికాదు. - Theomatic Music ఇవ్వడం. షిరాలీ గారి వద్ద పనిచేస్తున్నప్పుడు ఎన్నెన్నో సేకరించుకోగలిగాను. అంతవరకు నాకు కర్ణాటక సంగీతం తప్ప హిందుస్థానీ సంగీతం తెలియదు. ఆ బృందంలో ముగ్గురం తప్ప

మిగిలిన వారందరూ హిందుస్థానీ సంగీతానికి చెందిన వారే. అక్కడ హిందుస్థానీ సంగీతంతో పరిచయం ఏర్పడింది. ఖాళీ సమయం దొరికినప్పుడు వాళ్ళ రాగాలు - వాళ్ల రచనలు నేర్చుకోవడం - మన సంగీతం వాళ్లు నేర్చుకోవడం ఉంటుండేది. నన్ను ఆకర్షించిన మరొక్క విషయం ఏమంటే - మా రిహార్సల్ హాలులో గోడకి - ఒక పెద్ద గ్రాఫ్ ఉండేది. అదేమిటో అర్థం కాలేదు నాకు. అప్పుడు షిరాలీ ఆ గ్రాఫ్ ఉద్దేశం వివరించారు. ``ఈ చిత్రంలో కథ తెలుసు కదా, ఒక నృత్య కళాకారుడి జీవితం - ఉజ్వల భారతాన్ని గురించి కలలు కంటుంటాడు. కల కంటున్నంత సేపు అతని ఉత్సాహ ఉద్రేకాలు హెచ్చుస్థాయిలో ఉంటాయి. అప్పుడు గ్రాఫ్ పైకి నెడుతుంది అతని ఉత్సాహ ఉద్రేకాలని సూచించే సంగీతం మనం సమకూర్చాలి. అతని కల భగ్నం అయిపోతుంది. గ్రాఫ్ ఒక్కసారి కిందకి వాలిపోతుంది. అతనికి నిరాశా నిస్పృహలకి సరిపోయే సంగీతం ఇక్కడ ఇవ్వాలి. ఇల్లాగ చిత్రంలో కథానాయకుని ఉత్సాహ ఉద్రేకాలకు - నిరాశా నిస్పృహలకు అనువైన సంగీతం అందివ్వాలి ''. ఒక్కసారి వేయి మతాబులు వెలిగాయి నాలో, నా సంగీత లోకంలో అంతవరకు చీకటిగా ఉన్న భాగమేదో ఒక్కసారి వెలుగులోకి వచ్చినట్టయింది. అయితే సంగీతానికి ఒక ప్రయోజనం ఉంది. మానవుడు అనుభవించే ఆనందం - ఉల్లాసం, ఉత్సాహం - అతని నిరాశ - దుఃఖం - ఇల్లా అన్ని మానసికావస్థలను వ్యక్తం చేసే సంగీతం నువ్వు సృష్టించగలగాలి. ఇంతవరకు నేర్చుకున్న సంగీతం ఆ పని నెరవేర్చ లేకపోతే, అనంతమైన నాదప్రపంచంలో అన్వేషణ ఆరంభించు. సాంప్రదాయం గీచిన గీటును కాస్త అటూఇటూ దాటి, నీ ఆలోచనా సరళిని కొత్త మార్గాల్లో నడిపించు. ఇతర సంగీతాలని చెవికి పడనియ్యి. అప్పుడు నీ మార్గం విశాలం అవుతుంది. నీమేధకి పదును పెరుగుతుంది. ఇల్లాంటి ఆలోచనలు నాలో చోటు చేసుకొన్నాయి - షిరాలీ గారితో పనిచేస్తున్న కాలంలో.

అయిదేళ్ళ తర్వాత ఈ మధుర స్వప్నం ముగిసింది. మామూలు ప్రపంచంలో పడి మరో అంుదారేళ్ళు సినిమా రంగంలో పనిచేశాను. ఆ వాతావరణం నా తత్వానికి అంతగా పడలేదు. సుమారు పదేళ్ళు గడిపిన చిత్ర సంగీత రంగం మద్రాసు వదిలేసి 1955 వ సంవత్సరంలో హైదాబాద్ ఆకాశవాణి ప్రాంగణంలో అడుగుపెట్టాను.

ఉరకలు వేస్తూ పరవళ్ళు త్రొక్కుతూ కొండల మీదనుంచీ దూకుతూ ప్రవహించే నది మైదానాలు చేరుకునేసరికి ఉధృతం తగ్గి తాపీగా ప్రయాణం సాగించినట్టు, నా జీవిత గమనం కూడా ఆకాశవాణిలో చేరాక స్థిమితపడి - స్థిరపడింది. ఒక్కొక్క రంగంలో నిష్ణాతులైన, సహ ఉద్యోగుల సరసన పని



చెయ్యడం, ఎంతమంది మేధావులతో పరిచయాలు - ఎంతో ప్రోత్సాహకరమైన వాతావరణం ఆకాశవాణికి ఉండేది. నాకు రావలసినది ఏదో అక్కడ దొరికినట్టు అనిపించింది. రకరకాల ప్రయోగాలకి, రకరకాల కార్యక్రమాలు రూపకల్పన చేయడానికి స్వేచ్ఛ అక్కడ లభించింది. ఎందరెందరో కవుల గేయ సాహిత్యంతో పరిచయం అయింది. ఆయా కార్యక్రమాల అవసరాలకు పాటలు తయారుచేయడం ఒక క్రీడగా ఉండేది. ముఖ్యంగా రేడియో అన్నయ్య రాఘవరావుగారు, రేడియో అక్కయ్య కామేశ్వరమ్మగారు నాచేత ఎన్ని పాటలు చేయించారో! ఎన్నెన్ని సంగీత నాటికలు చేయించారో! పిల్లలకు సంబంధించిన పాటలు - స్త్రీలకు సంబంధించిన పాటలు, కార్మిక కర్షక గేయాలు పాఠశాల కార్యక్రమాల్లో విద్యార్థులకు పాటలు - ఇల్లా వస్తువైవిధ్యంతో ఎన్నెన్ని పాటలు ఆకాశవాణి నాచేత చేయించింది.

ఆకాశవాణికి అది ఒక స్వర్ణయుగం. కృష్ణశాస్త్రి, స్థానం, మునిమాణిక్యం - బుచ్చిబాబు, నాయని సుబ్బారావు, గోపీచంద్, సహజానంద వంటి వారితో పనిచేయడం మరపురాని అనుభవం. సంగీత నాటికలకి, లలిత సంగీతానికి ప్రత్యేక స్థానం సంపాదించుకుంది హైదాబాదు కేంద్రం. శ్రీయుతులు దాశరథి, నారాయణరెడ్డి, బాపురెడ్డి, భీమన్న, శేషేంద్రశర్మ, అరిపిరాల విశ్వం, ... చిరంజీవి, శశాంక, కోపల్లె శివరాం, పుట్టపర్తి నారాయణాచార్యులు, వేటూరి ఆనందమూర్తి మొదలగు కవిమిత్రుల గేయాలు ఎన్నో నా సంగీతంతో జతకట్టుకుని ప్రసారం అయ్యాయి.

కృష్ణశాస్త్రిగారు ఆకాశవాణిలో చేరాక, లలితసంగీతానికి కొత్త శోభ వచ్చింది. శాస్త్రిగారిలో ఉండే ప్రత్యేకత ఏదంటే ఆయన మాటలతో అల్లిన మల్లెపందిరికి, సహజంగా నాద సౌరభాలు వెదజల్లే గుణం ఉంది. ఆయన సాహిత్య చిత్రానికి, అంతర్లీనంగా ఉన్న సంగీతానికి స్పష్టమైన సజీవమైన రూపం కల్పించడం నాబోటి వాళ్ళ పని. ఆయన భావప్రవాహంతో, నా గానవాహిని ఐక్యం అయిపోగలగాలి. అప్పుడు సంగీత సాహిత్యాల సమ్మేళనం జరిగి ఆ పాట బట్టకట్టి పదికాలాలు బ్రతుకుతుంది. వాగ్గేయకారుల రచనలతో ఉన్న విశేషమే అది. సంగీత సాహిత్యాలమీద సమాన అధికారం గలిగి, ఆరెండూ కూడా ఒకే కౌగిలిలో ఒదిగిపోయి సాహిత్య భావవాహిని గానవాహిని కలిసిపోయి వాగ్గేయకారుల రచనలు కలకాలం నిలిచిపోయాయి. ``సంగీత బలంతోడుగా ఉంటే తప్ప పాట నిలవదు'' అనే రహస్యాన్ని ఎప్పుడో పట్టుకున్నారు శాస్త్రిగారు నాలాంటి వాడు ప్రక్కన లేకపోతే పాట వ్రాసేవారు కాదు. నేను వీణ వాయిస్తూ, కూడా పాడుతూ

శాస్త్రిగారి మృదుమధురమైన పదజాలాన్ని రాగ వీథుల్లో విహరింపచేస్తుంటే ఉద్భవించిన పాటలు ఎన్నెన్నో. ఒక్కొక్క పాట వెనకాల ఒక చరిత్ర ఉంది. అది విపులంగా చెప్పడానికి ఇక్కడ సమయం లేదు. వస్తు వైవిధ్యంతో, అనేక సంగీత నాటికల్లోను - అనేక సందర్భాల్లోనూ వచ్చిన ఆ పాటలన్నీ లలిత సంగీతంలో చిరకాలం నిలిచిపోయే సజీవశిల్పాలు.

రకరకాల పాటలకి వరసలు కట్టి పాడించటమే కాకుండా, మామూలు శ్రోతకి మన సంగీతంమీద అవగాహన పెంపొందించడానికి ''రసతరంగం'' అనే పేరుతో నెలకి ఒక కార్యక్రమం చొప్పున ప్రసారం చేసేవాణ్ణి. సంగీత పరిణామం, సంగీతసాహిత్య సంబంధ బాంధవ్యాలు, శాస్త్రీయసంగీతం - ఆధునిక సంగీతం, కర్ణాటక సంగీతం హిందూస్థానీ సంగీతం పోలికలు - తేడాలు, సంగీత వాయిద్యాలు - వాటి స్వభావం - ఇల్లా ఒక్కొక్క విషయం తీసుకుని, ఉదాహరణలతో అరగంట కార్యక్రమం చేసేవాడిని. ఈ కార్యక్రమాల పట్ల శ్రోతలు ఎంతో ఉత్సాహం చూపేవారు. నా మనస్సులో రకరకాల ఇతివృత్తాలు రూపుదిద్దుకుని కొత్త కార్యక్రమాలకి ప్రోత్సహించేవి. ఉదాహరణకి ఒక కార్యక్రమం గురించి కొద్దిగా వివరిస్తా.

ప్రకృతి మనకు ప్రసాదించిన వరాల్లో 'పండు వెన్నెల' ఒకటి. ఆకాశంలో వెన్నెల దర్శనం ఇవ్వగానే, ఒక్క క్షణం అన్నీమరిచి పోయి, ఆ హాయిని అనుభవించని మానవుడు ఉండడేమో! వెన్నెలగురించి ఎందరెందరో ఎన్నెన్ని భావాలో అందంగా చెప్పారు.

''వలది ఈ వెన్నెట్లు వేడాయనే   వలరాజు బాణాలు వాడాయెనే''
- కృష్ణశాస్త్రి

''యెన్నెలల సొగసంత - యేటి పాటేనటర''   - నండూరి

''కురిసి కురిసి వెన్నెల - గగనమలసిపోయింది''   - శేషేంద్ర

''పుచ్చపువ్వులా వెన్నెల - కవ్విస్తోంది నన్నిలా
మరిమతిపోతోంది ఎలా ఎలా''   - పాలగుమ్మి

''పైన పూస్తే వెన్నెలేను - పందిరేస్తే మల్లెలేను''   - కృష్ణశాస్త్రి

''తెప్పవోలే చంద్రబింబం - తేలిపోతూ ఉంది నింగిని
అందులో నా ముద్దుల స్రేయసి ఉంది కాబోలు''
- మల్లవరపు విశ్వేశ్వరరావు



ఎందరెందరో కవులు ఇన్ని విధాల వెన్నెలని వర్ణించారు. మరి సంగీత విద్వాంసులు కూడా వెన్నెల సౌందర్యాన్ని అనుభవించే ఉంటారు కదా! వారి సంగీతం ద్వారా ఈ అనుభవాన్ని ఎక్కడైనా వ్యక్తం చేశారా? ఇల్లాంటి ఆలోచనలు ఏవో నాకు వస్తుండేవి. అప్పుడే చంద్రగ్రహం మీద మానవుడు అడుగుపెట్టాడని వార్త వచ్చింది. సాహిత్య అకాడమీ కవులందరితోటీ ''సాహిత్యంలో చందమామ'' అనే కార్యక్రమం చేసింది, నేను ''సంగీతంలో చందమామ'' ఒక్క కార్యక్రమం రేడియోలో చేశా.

చందమామరావె జాబిల్లిరావె అని పసివాళ్ళ చందమామ, ''సల్లన్ని యెన్నెట్లో సొపేపి కూకుని'' వెన్నెల సుఖాన్ని అనుభవించే యువతీ యువకుల చందమామ, వివిధ దశల్లో చందమామని వర్ణించే పాటలు కొన్ని, బాల మురళీగారు పాడిన చంద్రజ్యోతి రాగం విలంబంగా విశ్రాంతిగా రాగాలాపన అందులో త్యాగరాజస్వామి కీర్తన - బీతో వెన్ మూన్‌లైట్ సొనటా (Moon Light Sonata) వీటితో సంగీతంలో చందమామ కార్యక్రమం కొత్తగా రక్తిగా సాగింది. అల్లాగే ఇతర దేశాల్లోని లాలి పాటలు కొన్ని సేకరించి ''ఉయ్యాలా జంపాలా'' అన్న కార్యక్రమం కూడా బాగా తయారయింది.

ఆకాశవాణిలో ఉండగానే, కృష్ణశాస్త్రిగారితో ఉన్న దీర్ఘ సాంగత్యం వల్ల - పాటలు వ్రాయాలన్న చపలత్వం కూడా కలిగింది. కాని ఈ వ్యాసంగాన్ని అతి రహస్యంగా అట్టే పెట్టాను. కృష్ణశాస్త్రిగారు ఆకాశవాణిని, హైదరాబాదును వదలి దూరంగా మద్రాసు వెళ్లిపోయాక కొంత ధైర్యం వచ్చి, నేను వ్రాసిన అమ్మదొంగా నిన్ను చూడకుంటే నాకు బెంగ అనే పాట వేదవతి ప్రభాకరరావుకు నేర్పి రవీంద్రభారతిలో ఒక కార్యక్రమంలో పాడించా. పాట బాగుందన్నారు అంతా. తర్వాత ధైర్యం కొంత హెచ్చి మిగతాపాటలు కూడా పైకి తీశా.

''ఎన్నిసారులు అన్నదో - ఎన్ని తీరులు విన్నదో
అన్న కొలదీ విన్నకొలదీ అమృత భరితము రామ చరితము'' అన్నపాట

''చిన్ననాటి నేస్తాలు చుట్టూ చేరాలి
మనసు విప్పి మాట్లాడే మనుషుల కలవాలి
ఒకరొకరూ ఆప్యాయత వొలకపొయ్యాలి
ఆగలేక నా కన్నులు చెమ్మగిల్లాలి
మాఊరు ఒక్కసారి పోయి రావాలి''

అని మా ఊరిమీద పాడినపాట

''వీణ మీటితే ఈమని
తరలి వచ్చింది ఆమని నా
మనసు కోరింది ఏమని ఆ

వీణ పలుకు వినిపించమనీ'' అని మాగురువుగారు శంకరశాస్త్రిగారు దివంగతుడైనప్పుడు అన్న పాట ఇల్లాంటి నా పాటలు కొన్ని దూరదర్శన్‌లో పాడా. బాగానే ఉన్నాయి అన్నారు సహృదయులు.

ఇల్లా ఆనందంగా పాడుతూ, యువగాయినీ గాయకులచేత పాడిస్తూంటే ఇట్టే గడిచిపోయాయి 26 ఏళ్ళు ఆకాశవాణిలో. నాకు ఆకాశవాణిలో చేసినది ఉద్యోగం అని ఎప్పుడూ అనిపించలేదు. ఆనందమయమైన క్రీడాస్థలంలో, నిరంతరం ఆటపాటలతో గడిపినట్టే కాలం గడిచిపోయింది. 31 మే 1979 సంవత్సరం నాటికి నాకు 60ఏళ్ళు నిండి పదవీ విరమణ సమయం వచ్చింది.

ఇంతదూరము కలిసి నడిచాము
ఎంతగానో మనసు కలిపాము, మరి
ఇంకనాకు సెలవా
మరువను మీ స్నేహపు విలువ

ఆకాశవాణి కళాదేవతలోగిలి
కవులను గాయకులను
కలిపినది తనకౌగిలి - ఈ
యింటిలో కాస్తంత చోటుదొరికి
నేనెంతగానో పెరిగి
పాల్కడలి నాతో పొంగి
కడలిలో కెరటాలవలె వయ్యారులు
నేనేర్చి కూర్చిన పాటలు - అవి
పాడెనెన్నో గొంతులు

మనసులల్లిన మమతలా పందిళ్ళు
రాగాలు చిలికే స్నేహపు పొదరిళ్ళు
అన్ని ఇచటనె వదలి - మెలమెల్ల నేను కదలి
సాగాలి ఇక న్యాప్రయాణం
ఏకాకిగా నా ప్రయాణం



అని వీడ్కోలు గీతం పాడుకుంటూ ఆకాశవాణి ప్రాంగణం వదలి బరువైన అడుగులతో బయటికి వచ్చేశాను. ఆకాశవాణి వదలి అప్పుడే 20 ఏళ్ళు అయిపోయింది. వచ్చీరాని నా సంగీతంతో ఇంతమంది మిత్రులను అభిమానులను సంపాదించుకోగలిగాను. లేకపోతే నాకోసం ఈ ఆర్భాటం ఏమిటి చెప్పండి ఇంతమంది శ్రమపడి ఈ ఉత్సవం ఏర్పాటు చేయడం ఏమిటి చెప్పండి. మీరు పాడాలి, మీరు పాడగలరు అని నావెంటబడి ఈవయస్సులో నాచేత పాడించి, కాసెట్ రికార్డు చేయించిన నా శిష్యురాలు చి.సౌ.హేమావతి, సోదరులు వినోద్‌బాబు, శివశంకర్‌లు వారికి నాయందున్న ప్రేమానురాగాలకి నేను బదులేమి ఇవ్వగలను? ఈ కార్యక్రమ కార్యభారాన్ని వహించిన మా నాదవినోదనీ సభ్యులు గాయినీ గాయక మిత్ర బృందం అందరికీ నా కృతజ్ఞతలు.

పాలగుమ్మి విశ్వనాథం



Vinjamuri Sita (Folk Music Producer), Krishna Sastry (Producer of Spoken Word), Palagummi (Producer of Light Music), Emani Sankar Sastri (Chief Producer of Karnataka Music)

## Magical memories. Mystical moments.

### Andhra Pradesh presents the most complete holiday plan.

**Take a trip down tradition lane.**



Andhra Pradesh is a land rich in the legacy of the past. Mesmerising forts, awe inspiring palaces, tombs that echo history. The state is a landscape filled with such wonders. Waiting for you to knock on their doors. Waiting for you to relive time. (Places to see include Golconda, Charminar, Qutb Shahi Tombs, etc.)

**Explore the abode of the Gods.**

Temple bells play ethereal music. Across hills and dales. Reverberating in the souls of millions of pilgrims. Each corner of Andhra Pradesh is a tribute to a different divinity. And a celebration of a million prayers. Come, say hello to a culture that has idolised man's belief in the supreme being. In manners most mystical. In shapes most magical. (Temples to visit include Tirupathi, Simhachalam, Bhadrachalam, Srisailam, Puttaparthi, Baasra, Ramappa etc.) Or if you are on the trail of the Buddha pay your homage at Nagarjunakonda, Amaravathi and of course Asia's largest monolithic Buddha statue at Hussain Sagar, Hyderabad.



**Frolic on the fun filled beaches.**



Listen to the age old rhythm of surf music. Walk along the unspoilt sands of time immemorial. Feel the spray of unpolluted seas. Pamper yourself with a feast of ethnically cooked sea food. Dance to the tune of hill country tribals. Have fun. Take back memories of smiles. (Beaches to see include Vizag, Chirala, Ongole etc.)

Nature has also hidden away in Andhra Pradesh some of its most beautiful secrets. The lush green Araku valley. The rippling rivers of Godavari and Krishna. Romantic hill stations like Horsley Hills. Not to forget the inimitable taste of traditional Andhra and Hyderabadi cuisine (ummm... the biryanis, the kababs wah wah!)




Holiday in Andhra Pradesh. Discover the world.

Tank Bund Road, Hyderabad - 500 022, Andhra Pradesh, India. Ph.Nos. +91-40-233110 233086 233087,





*With Best Compliments from :*

## The Andhra Pradesh Secretariat Staff Co-operative Society Ltd.

(Regd. No. P.929)

*Secretariat Buildings, Hyderabad - 500 022. Phone : 240793*

*Fixed Deposits will be accepted from members and nominal members also and interest will be paid as detailed below:*

| | | |
|---|---|---|
| a) | 46 days and below 6 Months | 11% |
| b) | 6 Months above and below 1 Year | 12% |
| c) | 1 Year above | 14% |
| d) | Deposits will be doubled in 56 Months | |

**MANAGING COMMITTEE MEMBERS**

1. C. Sankara Reddy, President
2. A. Prasad, Vice-President
3. B.R.M. Sharma, Treasurer
4. P.Prameela Rani, Secretary
5. J. Ramesh Singh, Managing Director
6. K. Ayyappa Reddy, Director (Audit)
7. S. Trimurthulu, Director
8. A. Chandrasekhar Rao, Director
9. R. Sambasiva Rao, Director
10. K. Pochaiah, Director
11. G. Jacob, Director

*With Best Compliments from :*

## ALKALI METALS LIMITED

Plot: B-5, Block III, IDA, Uppal, Hyderabad - 500 039.

✆ : 0091 40 7171179 / 7152298 / 7563002

Fax : 0091 40 7562634 / 7171454

E-Mail : alkali@hd1.vsnl.net.in

http: //www.alkalimetals.com

*Manufacturers of :*

SODIUM AMIDE
SODIUM AZIDE
SODIUM METHYLATE
SODIUM TERTIARY BUTOXIDE
SODIUM HYDRIDE
2-AMINO PYRIDINE
2,6, DIAMINO PYRIDINE
2-AMINO-6-METHYL PYRIDINE
2-AMINO-3-METHYL PYRIDINE
PHENYL-PYRIDYL ACETONITRILE
CYCLO PENTYL BROMIDE

ISO 9002 Certificate No. 13764

*With Best Compliments from :*

**Donor & Life Members**

Smt. V. Jayanthi Shanker, Hyderabad

Smt. & Sri Marthandam, Hyderabad

Smt. & Sri Suri

Smt. Parijatham

Sri A. Vidya Sagar, Abantel Softech Ltd., Hyderabad

Dr. Somaraju Susheela

M/s. Kapilan Distrilleries, Balanagar, R.R. District

M/s. Mc Dowell & Co. Nacharam, R.R. District

M/s. Liquors India (P) Ltd., Nacharam, R.R. District

M/s. Aroma Distilleries, Sanathnagar, Hyderabad

M/s. Gemini Distilleries, R.R. District

M/s. Satya Wineries & Distilleries, Nagole Village, R.R. District

M/s. Hyderabad Distilleries & Wineries, Uppal, R.R. District

M/s. Deltronic Marketing Pvt. Ltd., Secunderabad

M/s. Park Controls & Communications Pvt. Ltd., Bangalore

M/s. Advanced Micronics Pvt. Ltd., Hyderabad

A.V. Nagabhushanam, 2-1-99, Tobacco Bazar, Secunderabad
Wholesale Distributors for DIGJAM Suitings.